ఏం జరుగుతుందో!?

- బదిలీలపై ఉపాధ్యాయుల్లో వీడని ఆందోళన
- భారీగా వస్తున్న అభ్యంతరాలు
- ఎస్జీటీల స్థానచలనాలపై సందిగ్ధత



బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులతోపాటు భారీగా అభ్యంతరాలు కూడా వస్తుండటంతో అధికారులు సమావేశాలు, సరిచేయడంతోనే బిజీగా ఉంటున్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో వారికి కేటాయిస్తున్న ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు ఎంతో కీలకంగా మారుతున్నాయి. న్యాయబద్ధంగా రావాల్సిన పాయింట్ల కోసం రాజీ పడకుండా, ఇతరులు అక్రమంగా పాయింట్లు పొందకుండా అన్ని శక్తులు ఉపయోగిస్తున్నారు. అలాగే ఎస్జీటీల కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా!? లేదా మాన్యువల్‌గానే ముగిస్తారా అన్నదానిపై అనిశ్చితి నెలకొంది. దీనిపై విద్యాశాఖ అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో ఉన్నతాధికారులతో చర్చిస్తూ తర్జనభర్జన పడుతున్నారు. మొత్తమ్మీద ఇప్పటిదాకా 174 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించారు.

- వివరాలు 8లో..

రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా మునిశంకరయ్య

నెల్లూరు (హరనాథపురం), మే 31 (ఆంధ్రజ్యోతి) : స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీగా మునిశంకరయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని డీఐజీ కార్యాలయంలో అప్పటిదాకా అక్కడున్న పుష్పలత నుంచి మునిశంకయ్య బాధ్యతలు స్వీకరించారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పుష్పలతను శాలువాతో సత్కరించారు. మునిశంకరయ్యకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు.

ఆదివారం ప్రత్యేకం



కొరిమెర్ల ఎత్తిపోతల పథకం

అన్నదాతల ఆదర్శం!

పూర్తిగా మెట్టప్రాంతం. పంటలు సాగు చేయాలంటే నీటి కొరత. ఏం చేయాలో దిక్కుతోచని దైన్యస్థితి. ఇది మూడు దశాబ్దాల మాట. ఇప్పుడు ఆ ప్రాంతం డెల్టాతో పోటీపడుతోంది. ఇందుకు ఆ రెండు గ్రామాల రైతుల కృషే ఇందుకు కారణం. సంగం మండలం కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాల రైతుల్లో వేర్వేరు రాజకీయ పార్టీలు, వర్గాలు ఉన్నా వ్యవసాయం విషయంలో మాత్రం ఏకతాటిపై

ఎత్తిపోతల పథకం నిర్వాహణలో స్ఫూర్తి పథం

నడుస్తారు. ఎప్పుడో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అదెలాగో ఈ కథనం చదవండి...

8

నెల్లూరుపై మూడో కన్ను

- 300 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ
- మంత్రి నారాయణ చొరవతో నిధుల సమీకరణ
- కార్పస్ ఫండ్ కింద రూ.3 కోట్లు ఇచ్చిన యూబీఐ
- పోలీస్, కార్పొరేషన్లలో కమాండ్ కంట్రోల్ రూమ్స్
- నెల రోజుల్లో అందుబాటులోకి... 8



నెల్లూరు నగరంలో పెరుగుతున్న నేరాలు.. చోరీల అదుపునకు పోలీసు వ్యవస్థ చేతిలోకి శక్తివంతమైన ఆయుధం రాబోతోంది. సువిశాలమైన నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి కార్పొరేషన్‌కు ఊరంతా కళ్లు చేసుకొని చూసుకునే గొప్ప సౌకర్యం అక్కరకు రానుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కేవలం ఒక నెల రోజుల్లో నగరం మొత్తం నిఘా నేత్రాల పర్యవేక్షణలోకి రాబోతుంది. మంత్రి పొంగూరు నారాయణ చొరవ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) నిధులతో నెల్లూరు నగరం సురక్షితంగా..పరిశుభ్రంగా ఉండటానికి ఆస్కారం ఏర్పడుతోంది.



సంగం : లబ్ధిదారుకు పింఛను నగదు అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

92 శాతం పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను 92 శాతం మందికి అందజేశారు. మొత్తం 3,04,827 మందికిగాను 2,78,000 మందికి పంపిణీ చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు ఈ పంపిణీ నిరంతరంగా సాగింది. సంగం మండలం వీర్లగుడిపాడులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరులోని జాఫర్‌సాహెబ్ కాలువకట్ట ప్రాంతంలో మంత్రి నారాయణ లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు.

3న ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల జట్లను జూన్ 3న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బీ.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే సబ్‌జూనియర్స్ బాల, బాలికలు జనవరి 2012 నుంచి డిసెంబర్ 2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. జూనియర్స్ విభాగంలో 2010 జనవరి నుంచి 2011 డిసెంబర్ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టేడియంలో హాజరు కావాలన్నారు.

జిల్లాలో సగటు వరపాతం 7.9 మిమీ

నెల్లూరు (హరనాథపురం), మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సగటు వర్షపాతం శనివారం 7.9 మిమీగా నమోదైంది. అత్యధికంగా ఇందుకూరుపేటలో 33.8 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా ముత్తుకూరు, ఏఎస్‌పేటలలో 1.6 మి.మీ వర్షం కురిసింది.

అంతా పకడ్బందీగా..

ఇంటర్వ్యూ...



“ఎండీయూ వ్యవస్థ రద్దుతో కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేరుగా రేషన్ షాపుల వద్దనే సరుకులు తీసుకోవచ్చు. ఇందుకు పరిధి అంటూ ఏమీ లేదు. షాపులోనైనా సరుకులు అందుకోవచ్చు. ఇక అక్రమాలకు తావు లేకుండా కార్డుదారు చేసే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలిస్తాము. డీలర్లు పరిధి దాటితే అప్పటికప్పుడే కఠిన చర్యలు తీసుకుంటాము.' అని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్. విజయకుమార్ స్పష్టం చేశారు. రేషన్ షాపుల్లో ఆదివారం రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- నేటి నుంచి షాపుల్లో రేషన్ పంపిణీ
- 1-15వ తేదీ వరకు సరుకుల అందజేత
- 5వ తేదీలోపు వృద్ధులు, దివ్యాంగులకు..
- సమస్య ఉంటే కార్డుదారు ఫోన్ చేయొచ్చు!
- షాపు ముందు సరుకు నిల్వతోపాటు ఫోన్ నెంబర్ల ప్రదర్శన
- డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం
- జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విజయకుమార్

? కొత్త విధానంలో సరుకుల పంపిణీ ఎలా

! రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ ప్రక్రియ ఆదివారం ప్రారంభమవుతుంది. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరుకుల పంపిణీ ఉంటుంది. ఈపాస్‌తోపాటు తూకం పరికరాలను సిద్ధం చేసుకోవాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చాం. షాపుల వద్ద డీలర్ల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని ఆదేశాలు ఇచ్చాం. ఆదివారం షాపులను పూలతో అలంకరించి, ప్రజా ప్రతినిధులు, వయోవృద్ధులను ప్రారంభ కార్యక్రమాలకు ఆహ్వానించాలని డీలర్లకు సూచించాం. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి షాపులు ఉంచుతారు. ఆదివారం కూడా సరుకులు తీసుకోవచ్చు.

? షాపులోనైనా సరుకులు తీసుకోవచ్చా?

! తీసుకోవచ్చు. ఆ వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. రేషన్ తీసుకోకపోయినా కార్డు రద్దు కాదు. ఒక వేళ సరుకులు ఇవ్వమని డీలర్ చెబితే ఫిర్యాదు చేయవచ్చు.

? షాపులకు సరుకులు చేరిపోయాయా

! బియ్యం, పంచదార తదితర సరుకులు స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు చేరాయి. డీలర్లు ఈ పాస్ ద్వారా సరుకులు తీసుకుంటారు. ఖచ్చితమైన తూకం ప్రకారం సరుకులను చేరవేశాం. డీలర్లు కూడా కార్డుదారులకు ఖచ్చితమైన తూకంతో అందచేయాలి. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే అప్పటికప్పుడే చర్యలు తీసుకుంటాము.

? షాపుల వద్ద సరుకు నిల్వల బోర్డు ఏర్పాటు చేయించారా?

! రేషన్ షాపుల వద్ద సరుకుల నిల్వల స్థితిగతులు తెలిపే బోర్డులతో పాటు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నాం. ఫిర్యాదులను తెలిపేందుకు అధికారుల ఫోన్ నెంబరునూ ఏర్పాటు చేయించాం. దీనికితోడు షాపుల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచనలు జారీ చేశాం. వినియోగదారులు సామాజిక దూరం పాటించేలా, మాస్కులు ధరించేలా చూడాలని కోరాం.

? జిల్లాలో ఎంత బియ్యం, చక్కెర అవసరం

! జిల్లాకు 10,953 టన్నుల బియ్యం, 380 టన్నుల చక్కెరను కేటాయించారు. రేషన్ షాపులలో కార్డుల సంఖ్యను బట్టి సరుకులను కేటాయించాం. ఒక వేళ కార్డుదారు మరోషాపులో సరుకులు తీసుకుంటే ఆ సరుకు సంబంధిత డీలరు వద్ద మిగిలి ఉంటుంది. మరుసటి నెలలో లెక్కప్రకారం సరుకులు కేటాయిస్తాం. డీలర్లు కూడా సక్రమంగా సరుకు నిల్వ లెక్కలు చెప్పాలి. అలా చేయకుంటే చర్యలు తప్పవు.

? జిల్లాలో ఎన్ని షాపులు, కార్డులు ఉన్నాయి

! జిల్లాలో 1513 షాపులు, 7,22,524 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 6,25,119 మంది సరుకులను తీసుకుంటున్నారు. మే నెలలో 86.63 శాతం సరుకుల పంపిణీ జరిగింది. కొత్త విధానం ద్వారా పంపిణీ ఎంత జరిగిందనేది జూన్‌లో తెలుస్తుంది. కార్డుదారులందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

? దివ్యాంగులు, వృద్ధులకు ఎలా

! 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు వారి ఇళ్ల వద్దకే డీలరు వెళ్లి సరుకులు అందజేస్తారు. జిల్లాలో 89,127 మంది వయోవృద్ధులు, 33,148 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ లోపు సరుకులు అందేలా ఏర్పాట్లు చేశాం. వీరందరికీ వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

? బయోమెట్రిక్, ఐరిస్ పరికరాల మాటేమిటి

! కాటాలు, బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలకు మరమ్మతులు చేయించారు. వాటి పనితీరులో లోపాలు లేకుండా సరిచేశాం. ఈ పాస్ యంత్రాలను ఆధునీకరించాం. సరుకులకు యూపీఐ, డిజిటల్ విధానంలో నగదు చెల్లించేలా ప్రొత్సహిస్తాం. ఈ పాస్‌లు మొరాయించకుండా ట్రయల్ రన్ కూడా నిర్వహించాం.

? తనిఖీలు ఎలా ఉంటాయి?

! రేషన్ షాపుల పరిశీలన, తనిఖీలకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్‌ల ద్వారా షాపులలో ఏరోజుకారోజు సరుకుల నిల్వలు, పంపిణీ తదితర వివరాలు స్పష్టంగా తెలుసుకుంటాం. ఎప్పటికప్పుడు తనిఖీలు కూడా ఉంటాయి. డీలరు అక్రమాలకు పాల్పడ్డాడని తెలిస్తే గతంలోలా కాకుండా తక్షణమే చర్యలు తీసుకుంటాం. శిక్షలు కూడా ఉంటాయి.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



కోవూరు : షాపునకు చేరిన బియ్యం బస్తాలు, ఫిర్యాదు చేసే ఫోన్ నెంబర్లు కలిగిన ఫ్లెక్సీ వద్ద డీలరు



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వీఆర్వో గంగాధర్

లంచం ఇస్తేనే మ్యుటేషన్!

- జమ్మవరం వీఆర్వో డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితులు
- పక్కా ప్రణాళికతో అదుపులోకి...

ఏఎస్ పేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : అడిగినంత ఇస్తేనే మ్యుటేషన్ చేస్తానన్న వీఆర్వో చివరకు ఏసీబీకి పట్టుబట్టాడు. ఏఎస్‌పేట మండలం జమ్మవరం వీఆర్వో గంగాధర్ ఓ రైతు వద్ద రూ.15వేలు లంచం తీసుకుంటుండగా శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శిరీష తెలిపారు. వివరాల్లోకి వెళితే..

జమ్మవరం పంచాయతీ పరిధిలోని కాకర్లపాడు గ్రామానికి చెందిన టి పద్మమ్మకు చెందిన 1.78 ఎకరాల భూమి ఉంది. అయితే, ఈ భూమికి సంబంధించి మ్యుటేషన్ కోసం 10 రోజుల క్రితం తహసీల్దారు శ్రీరామకృష్ణకు పద్మమ్మ అర్జీ పెట్టుకున్నారు. అయితే, రోజులు గడుస్తున్నా తన పని కాకపోవడంతో ఆమె వీఆర్వో గంగాధర్‌ను కలిశారు. కార్యాలయంలో పనులు త్వరగా జరగాలంటే రూ.25 వేలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే, తాను అంత ఇచ్చుకోలేనని పద్మమ్మ ప్రాధేయపడింది. చివరకు రూ.15వేలు ఇవ్వాల్సిందేనని వీఆర్వో పట్టుబట్టడంతో ఒప్పుకుంది. ఈ విషయం ఆమె తన చెల్లి కుమారుడు అశోక్‌కుమార్‌కు చెప్పుకుని బాధపడింది. పొలానికి సంబంధించిన కాగితాలన్నీ సక్రమంగా ఉన్నా డబ్బులు డిమాండ్ చేయడం, లంచం ఇవ్వడం ఇష్టంలేని అశోక్‌కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

పక్కా వ్యూహంతో..

బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న ఏసీబీ డీఎస్పీ శిరీష పక్కా వ్యూహం రచించారు. శనివారం ఉదయం జమ్మవరం సచివాలయం వద్ద మాటు వేశారు. అశోక్ కుమార్‌కు రూ.15వేల నగదు ఇచ్చి సచివాలయనికి పంపించారు. కార్యాలయంలో లోపల వీఆర్వో గంగాధర్‌కు నగదు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శిరీష తన సిబ్బందితో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్వో నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆమె వెంట ఏసీబీ సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల తీవ్ర అనారోగ్యాలు



పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల తీవ్ర అనారోగ్యం వస్తుందని, వెంటనే దాని వాడకాన్ని విడనాడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ శనివారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బోసుబొమ్మ వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వల్ల ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ధూమపానం వల్ల గుండె వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తుల నివారణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్‌సీడీ పీవో డాక్టర్ యశ్వంత్, పీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్, ఎన్‌సీసీ అధికారి బాల సుబ్రహ్మణ్యం, నేవల్ అధికారి నాగేంద్ర బాబు, డాక్టర్ దివ్య, ఎన్‌సీడీ విభాగం అధికారి హాసిని, తదితరులు పాల్గొన్నారు.



చాముండేశ్వరి ఆలయం

గంగపట్నంలో బ్రహ్మోత్సవాల శోభ

- రేపటి నుంచి 13వ తేదీ వరకు నిర్వహణ
- ముస్తాబైన చాముండేశ్వరి ఆలయం

ఇందుకూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కోరిక కోరికలు తీర్చే అమ్మవారిగా పేరొందిన చాముండేశ్వరి దేవిని దర్శనం చేసుకునేందుకు వేలాదిమంది భక్తులు గంగపట్నానికి తరలివస్తుంటారు. ఉత్సవాలకైతే భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. అమ్మవారిని సేవించిన మానసిక వ్యాధులు, గ్రహదోషాలు, దీర్ఘ రోగాల బారిన నుంచి బయటపడవచ్చని భక్తుల నమ్మకం. అంతేగాక సంతానం లేనివారు అమ్మవారి దేవస్థానానికి వచ్చి స్నానం ఆచరించి భక్తితో 40 రోజులు 108 ప్రదక్షిణ చేస్తే సంతానం కలుగుతుందన్న నమ్మకమూ ఉంది. ఇక గ్రామ ఆచారం ప్రకారం ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఒక్కరూ మాంసాహారానికి దూరంగా ఉంటారు. శుచి శుభ్రత నియమ నిష్టలతో అమ్మవారి కల్యాణాన్ని తిలకిస్తారు. కాగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు జూన్ 2 నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయి. 10న కల్యాణం, 11న త్రిశూలేశ్వరస్వామి గంగోత్సవం, 12న రథోత్సవం, నిప్పులగుండం, 13న తెప్పోత్సవం జరగనుంది.

భక్తులతో కిక్కిరిసిన కోన



శ్రీవారి ఆలయంలో భక్తులు

పెంచలకోన బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన మూడవ శనివారం కావడంతో పెంచలకోన క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పెంచలో, గోవింద నామస్మరణలతో క్షేత్రం మారుమోగింది. తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు, నిత్య కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ, క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి 2 గంటలకుపైగా సమయం పట్టింది. ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

మాలకొండకు పోటెత్తిన భక్తులు

వలేటివారిపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. నరసిహంహస్వామి జయంత్యుత్సవాలు పూర్తయి రెండు వారాలు అయింది. జయంత్యుత్సవాలకు రాలేకపోయిన భక్తులు శనివారం తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రాకతో క్యూలైన్లు కిటకిటలాడాయి. కాగా, స్వామివారికి శనివారం భక్తుల నుంచి రూ.11,93,209 ఆదాయం లభించనట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక దర్శనం ద్వారా రూ.5,53,700, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,12,290, అన్నదానం ద్వారా రూ. 2,33,214, తలనీలాల ద్వారా రూ. 88,375 లభించినట్లు పేర్కొన్నారు.



అమ్మవారి ఆలయానికి వెళ్లే మెట్లదారిలో కిక్కిరిసిన భక్తులు

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ

వెంకటాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారానే నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దారు శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి రేషన్ షాపు డీలర్ల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి డీలర్ ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వరకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తారని, ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పంపిణీ చేస్తారన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9188
వెండి కిలో ధర	రూ. 99,600
వెండి ఒక గ్రాము	రూ. 102.60

అభద్రతాభావానికి అవకాశమే లేదు

● నిర్మలానందబాబా, తహసీల్దారు, కోవూరు

కోవూరు, మే, 31(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల సరఫరా డీలర్లకు కేటాయించడంతో వినియోగదారులు సరకులు అందవనే అభద్రతాభావానికి అవకాశమేలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి చౌకదుకాణాల డీలర్ల ద్వారా సరకుల సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మండలంలోని 47 దుకాణాల ద్వారా 61,674 మంది వినియోగదారులకు నిత్యావసర సరకులు పంపిణీ అన్ని చర్యలు తీసుకున్నామని తహసీల్దారు నిర్మలానందబాబా తెలిపారు.

? చౌకధరల దుకాణాల డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీ ఎలా చేయనున్నారు.

! మండలంలోని 47 దుకాణాల ద్వారా సరకుల పంపిణీకి డీలర్లు సిద్ధంగా ఉన్నారు. ఎండీయూ వాహనాల్లో జరిగిన విధానంతోనే ఈ పాస్ మిషన్ల ఆధారంగా సరకులు పంపిణీ చేస్తారు. అన్ని దుకాణాలకు తూనిక యంత్రాల్ని అందచేశాం. ఎలాంటి ఆటంకం లేకుండా సరకుల సరఫరా వేగవంతంగా సాగుతుంది.

? మండల పరిధిలో ఎంతమంది కార్డుదారులున్నారు.



! కోవూరు మండల పరిధిలో 61,674 మంది కార్డుదారులు న్నారు. వారిలో ఇప్పటికే 57, 397 మంది ఈకేవైసీ చేయించు కున్నారు. కార్డుదా రుడు ఈపాస్ మిషన్‌లో వేలిముద్ర వేయగానే సరుకుల సరఫరాకు వీలవుతుంది.

? కార్డుదారులు డీలర్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందా.

! కార్డుదారులు డీలర్ల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశమే లేదు. డీలర్ల వద్ద సరకులు ప్రతి నెల 15వ తేదీ వరకు ఉంటాయి. ఉదయం 8నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8గంటల వరకు సరకులు తీసుకోవచ్చు. సరకులు అందలేదనే అభద్రతా భావమే ఉండదు.

? డీలర్ల అక్రమాలను ఎలా అరికడతారు.

! ఆన్‌లైన్ ఇన్‌స్పెక్షన్ యాప్‌లో కార్డుదారులకు సరకులు అందే తీరును పొందుపరుస్తారు. యాప్‌లో సరకుల నిల్వల్లో తేడా కన్పిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. కార్డుదారుడు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే చర్యలు తీసుకుంటాము.

ఈ ముఖాముఖి

నీటి సౌకర్యం లేక
నిరుపయోగంగా సామాజిక మరుగుదొడ్లు



అపరిశుభ్రంగా మరుగుదొడ్డి

మనుబోలు, మే 31 (ఆంధ్రజ్యోతి): నీటి సౌకర్యం లేకపోవడంతో లక్షల రూపాయలతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మనుబోలు పంచాయతీలో ఎస్‌బీఎమ్ నిధుల కింద రూ. 3లక్షలతో రెండు సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఎన్నికలయ్యే వరకు వీటి నిర్మాణం అసంపూర్ణంగానే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేశారు. ప్రభుత్వ కార్యాలయాల నడుమ వీటిని నిర్మించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు, ఇతర సిబ్బందికి ఉపయోగపడతాయని నిర్మించారు. నీటిసౌకర్యం లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. నిర్వహణ లేకపోవడంతో నిరుప యోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



నీటి సౌకర్యం లేని వాష్‌బేసిన్



బయట ముస్తాబుగా కనిపిస్తున్న మరుగుదొడ్లు

పీహెచ్‌సీని సందర్శించిన టీడీపీ నాయకులు

కొడవలూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : కొడవలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తదితరులు శనివారం సందర్శించారు. వైద్యులను అడిగి సమస్యలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

వైసీపీ రాష్ట్ర యువజన కమిటీ సంయుక్త కార్యదర్శిగా కడివేటి

బుచ్చిరెడ్డిపాళెం, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన కడివేటి అన్వేష్‌రెడ్డిని నియమిస్తూ ఆపార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల జారీ చేశారు. ఈమేరకు అన్వేష్‌రెడ్డి తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో నారాయణ మెడికల్ కళాశాల, నారాయణ రూరల్ హెల్త్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణ రూరల్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే.ఈ.సీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీ మనోభిరామ్, డాక్టర్ సీ రాజేష్‌రెడ్డి, డాక్టర్ వినీత, రూరల్ హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే సోమిరెడ్డి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పిడతా పోలూరు, ముసునూరువారిపాలెం పంచాయతీల్లో శనివారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈసం దర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో 38,497 మంది లబ్ధిదారులకు రూ.16కోట్ల65లక్షలు ప్రతినెలా ప్రభుత్వం అందజేస్తోందని, వచ్చే నెలలో కొత్తగా 2800 పైగా పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ అవుతాయన్నారు. రానున్న రెండు నెలల్లో రైతులకు అన్నదాత సుఖీభవ, చదువుకునే పిల్లలకు తల్లికి వం దనం అందజేయనున్నామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చ డంతో పాటు ప్రజా సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమ లుచేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు నరకం అనుభవించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఫలాలు అందుకుంటూ సంతోషంగా ఉన్నారన్నారు. నియోజక వర్గంలో ఈ ఏడాది రూ. 121కోట్లతో వివిధ శాఖల కింద 685 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఈపూరు మునిరెడ్డి, సురేష్ రెడ్డి, రమేష్‌శర్మ, దండు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం తెల్లవారు జాము నుంచే పెన్షన్లు పంపిణీ చేశారు. 5805 మందికి పెన్షన్లు పంపిణీ చెయ్యడం జరిగిందని ఎంపిడివో మారెళ్ల భవాని తెలిపారు. మిగిలిన 550 మంది ఇళ్లలో లేకపోవడం తదితర కారణాల వలన ఇవ్వలేదని ఆమె తెలిపారు.

అనికేపల్లి వైసీపీకి భారీ షాక్

ఎమ్మెల్యే సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ఫ్యాన్ పార్టీ నేతలు

వెంకటాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనికేపల్లి పంచాయతీ పరిధిలోని వైసీపీకి భారీ షాక్ తగిలింది. శనివారం సాయంత్రం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డితోపాటు అనికేపల్లి పంచాయతీ సర్పంచ్ కొమరగిరి సీనమ్మ, అనికేపల్లి, గొలగమూడి ఎంపీటీసీ సభ్యులు మోడిబోయిన సుమతి, మేకల రమణమ్మ, అనికేపల్లి పంచాయతీలోని 13 మంది వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుర్రపు రథంపై సోమిరెడ్డిని ఊరేగించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ తాను ప్రజా సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు చేశానన్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి, అక్రమాలు, దోపిడీలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణరెడ్డి, నేతలు బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, ఈపూరు మురళీరెడ్డి, బాబిరెడ్డి, ముక్కు చంద్రశేఖర్, పార్థసారధినాయుడు, పాకాల శ్రీనివాసులు, గొట్టం బ్రహ్మయ్య, తదితరులున్నారు.

గొలగమూడిలో భక్తుల సందడి

వెంకటాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విజ్ఞాన పర్యటనలకు వేదిక బటర్‌ఫ్లై గార్డెన్

తోటపల్లిగూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండి యా లిమిటెడ్‌లో సీతాకోకచిలుక తోట (బటర్‌ఫ్లై గార్డెన్) విజ్ఞాన పర్యట నలకు వేదిక అవుతుందని కంపెనీ సీఈవో రాఘవ త్రివేది పేర్కొన్నారు. శనివారం ప్రకాశం జిల్లా కనిగిరిలోని కదిరి బాబురావు వ్యవసాయ కళా శాల విద్యార్థుల బృందం ఈ పరిశ్రమను సందర్శించింది. ఈసందర్భంగా కంపెనీ సీఈవో రాఘవ్ త్రివేది మాట్లాడుతూ బటర్‌ఫ్లై గార్డెన్‌లో వివిధ రకాల అందమైన సీతాకోకచిలుకల జాతులు ఉన్నాయన్నారు. ఇది నెల్లూరు, చుట్టుపక్కల జిల్లాల్లో ఒక ప్రత్యేకమైన ప్రాంతంగా మారిందన్నారు. కార్యక్ర మంలో ఎస్‌ఈఐఎల్ కంపెనీ ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఈఐఎల్ విద్యుత్ పరిశ్రమను సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం

వీఎస్‌యూ విద్యార్థినికి డాక్టరేట్



ఎంవీఎల్ శైలజ

వెంకటాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో వాణిజ్య విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని ఎంవీఎల్ శైలజకు శనివారం వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. జిల్లాలోని గ్రామీణ చేతివృత్తులపై ఆర్థిక అంశాలు, ప్రభావం అనే అంశంపై ప్రొఫెసర్ వెంకటరావు ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకుగాను శైలజకు డాక్టరేట్ ప్రదానం చేసింది. శైలజ ప్రస్తుతం గూడూరు ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో శైలజను వాణిజ్య అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు అభినందించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మనుబోలు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి కూలి రూ. 300 వస్తుందని ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. మండలంలోని వీరంపల్లి పంచాయతీలో శనివారం ఉపాధిహామి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కూలీలతో మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు రావాలన్నారు. ఉపాధిహామి క్షేత్రసహాయకుడు ఆనాల ఏడు కొండలు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపీడీవో సామాజిక పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఆర్‌ఆర్ కాలనీ సమీపంలో నెల్లూరు - పొదలకూరు ప్రధాన రహదారిపై శనివారం జరి గిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేర కు వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన నాగేంద్ర మోటార్ బైక్‌పై తేనె అమ్ముకుంటూ వ్యాపారం చేస్తుంటాడు. ఈక్రమంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా నెల్లూరు వైపు నుంచి పొదలకూరు వైపు వస్తు న్న మరో మోటార్‌బైక్ వేగంగా ఢీకొంది. ఈప్రమాదంలో నాగేంద్రతో పాటు మరో బైక్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు కూడా గాయపడినట్లు స్థాని కులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.

చిన్నారిపై అత్యాచారం అమానుషం : బొబ్బేపల్లి



మాట్లాడుతున్న జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు

వెంకటాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని మైలవరం మండలంలో మూడున్నరేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి చంపి కంపచెట్లల్లో పడేసిన ఘటన అమానుషం అని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తీవ్రంగా ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చిన్నారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం రెండు ఎకరాల పొలం, రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించిందని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఘటనకు కారకుడైన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు కాకి శివ కుమార్, మణి, చల్లా చెంచయ్య, అజయ్, మంగపతి వంశీ, సాయి, తురక పవన్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● నగర పంచాయతీ చైర్ పర్సన్ సుప్రజ



బుచ్చిలో పట్టణంలో పింఛను పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, మే 31(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. శనివారం బుచ్చి అర్బన్, రూరల్ టీడీపీ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్‌లు బుచ్చి నగర పంచాయతీలోని పలు వార్డులు, మండలంలోని రేబాల, దామరమడుగు గ్రామాల్లో పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కేవీ శేషయ్య, వుసురుపాటి ప్రసాద్, మస్తానయ్య, రియాజ్. టీవీఆర్, సుధాకర్, వివేక్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేబాలలో మోటార్ల చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాల వ్యవసాయ పొలాల్లో రెండు వ్యవసాయ మోటార్లు చోరీకి గురైనట్లు శనివారం స్థానిక రైతులు తెలిపారు. ఈ మేరకు బాధజత రైతు మురళి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

నకిలీ ప్యారాచూట్ కొబ్బరినూనె

● కంపెనీ ప్రతినిధుల తనిఖీల్లో వెలుగులోకి..



దుకాణంలో ప్యారాచూట్ కొబ్బరినూనె ఆయిల్ బాటిల్స్ తనిఖీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో కల్తీలు, మోసాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రతి వస్తువులో కల్తీ ఉందని వినియోగదారులు ఎప్పటికప్పుడు వాపోతున్నా వాటిని నియంత్రించే అధికారులు కరువయ్యారు. ప్రతి వస్తువులో కంపెనీ ఉత్పత్తుల కన్నా నకిలీ ఉత్పత్తులు తక్కు వ ధరకు వస్తుండటంతో బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు విక్రయిస్తున్నారనే ప్రచారాలు ఉన్నాయి. తలకు రాసుకునే ప్యారాచూట్ కొబ్బరి నూనె ఆయిల్ బాటిల్స్ కూడా కావలిలో నకిలీలు విక్రయిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధుల తాజా తనిఖీలో వెలుగు చూసింది. వాస్తవానికి ప్యారాచూట్ కొబ్బరినూనె మాతృసంస్థ అయిన మారికో సంస్థ ముంబై హైకోర్టులో వేసిన పిల్ ఆధారంగా ముంబై హైకోర్టు దీనిపై కమిషన్ వేసింది. అందులో సభ్యులైన న్యాయవాదులు ఎం.చెంగప్ప, మల్లేశ్వరరావు పర్యవేక్షణలో మారికో సంస్థ లీగల్ టీం స్థానిక పోలీసుల సహకారంతో శనివారం కావలిలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక దుకాణంలో ప్యారాచూట్ నకిలీ కొబ్బరినూనె బాటిల్స్ పట్టుబడ్డాయి. దీంతో అవి ఎక్కడ తెచ్చారో ఆరాతీసి వారి విరాలతో సహా ఆ దుకాణం యజమాని నుంచి లిఖిత పూర్వకంగా రాయించుకున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

పెన్నానదిలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

● కుటుంబ కలహాలే కారణం



పెన్నానదిలో మృతిచెందిన రమేష్‌బాబు

నెల్లూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టేపాళెం వద్ద పెన్నానదిలో ఏఆర్ కానిస్టేబుల్ శనివారం మృతి చెందాడు. మృత దేహాన్ని స్థానికులు కనుగొని రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గుంజి వేణు కథనం మేరకు వివరాలు.. 2012 బ్యాచ్‌కి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రమేష్‌బాబు (32) స్వగ్రామం ఇందుకూరుపేట మండలం పల్లిపాడు. రేపల్లె సమీప ప్రాంతానికి చెందిన వాణిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి 8 ఏళ్ల పాప ఉంది. ఇరువురి మధ్య కలహాలు ప్రారంభం కావడంతో ప్రస్తుతం వాణి పుట్టింట్లో ఉంది. ఈ క్రమంలో రమేష్‌బాబు పొట్టేపాళెం వద్ద పెన్నానదిలో శవమై తేలడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రమాదవశాత్తు పడి మరణించాడా...? లేక ఆత్మహత్య చేసుకున్నాడా...? అన్నది దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.ఆయన ఈనెల 28వ నుంచి ఎవరికీ అందుబాటులో లేడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపామని, కుటుంబ సభ్యులతో మాట్లాడితేకాని పూర్తి సమాచారం తెలియదని ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మే 31 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై నగరంలోని చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. నేపాల్ ప్రాంతానికి చెందిన గగన్, భావన జైషీడ్ దంపతులు. ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం నగరానికి వచ్చారు. నగరంలోని రమేష్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటూ ఓ నర్సింగ్ హోమ్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 24న ఉదయం భావన జైషీడ్ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో గగన్ చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో వివాహిత మృతదేహం



లావణ్య మృతదేహం పరిశీలిస్తున్న పోలీసులు

సంగం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరమనకు చెందిన వివాహిత వన్నె లావణ్య (28) కనిగిరి ప్రధాన కాలువలో మృతిచెంది ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా, లావణ్యకు 8 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కాగా శుక్రవారం సాయంత్రం నుంచి లావణ్య కనిపించకుండా పోయింది. గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆమె మృతదేహం కాలువలో లభించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య



మృతి చెందిన నవ్య

ఉదయగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించ డంతో మనస్తా పానికి గురై ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసు కున్న సంఘటన పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శనివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన గాలేటి రమణయ్య, రత్నమ్మల కుమార్తె నవ్య(17) ఫ్రైడ్‌రైస్ కోసం బంధువుల ఇంటి వద్ద ఉన్న తన తల్లిని రూ.50 నగదు అడిగింది. తల్లి తన దగ్గర డబ్బులు లేవని, మందలించి రూ.20 ఇచ్చింది. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఇంటికెళ్లి గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొంతసేపు తరువాత ఇంటికొచ్చిన తల్లి ఎంత కొట్టినా తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో గడియ తీసి చూసేసరికి ఉరి వేసుకుని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దింపి చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మృతురాలి ఇంటిని పరిశీలించడంతో పాటు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 525

'దాడుల నుంచి రక్షణ కల్పించండి'

నెల్లూరు (సాంస్కృతికం) మే 31 (ఆంధ్రజ్యోతి) : భూకబ్జాలను అడ్డుకున్నందుకు కలిగిరి మండలం జిర్రావారిపాలెంలో రమణయ్య దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు చేటూరు శ్రీనయ్య, గ్రామవాసులు సీహెచ్ శీనమ్మ, రమాదేవి, నారాయణి తదితరులు తెలి పారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని యానాదులకు న్యాయం చేయాలని కోరారు.

నేటి నుంచి విద్యార్థులకు పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులపై ఆదివారం నుంచి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్ రాజా తెలిపారు. శనివారం వేసవి శిక్షణ శిబి రాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో విద్యార్థులకు గణితంలో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, గేమ్స్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ నెల 4 వరకు పోటీలు నిర్వహించి 5న బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్, ప్రసన్న పాల్గొన్నారు.

ఎండమావిగానే శిల్పారామం !

● స్థల వివాదంతో ఆగిన నిర్మాణాలు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం) మే 31 (ఆంధ్రజ్యోతి) : కనువిందుచేసే కళాఖండాలు... సాంస్కృతిక ప్రదర్శనకు కళావేదిక... చేనేత హస్త కళావస్తువుల విక్రయశాలలు.. విడిది గృహాలతోపాటు కమ్యూనిటీ హాలు... పచ్చని గ్రీనరీ.. కనువిందు చేసే పూలమొక్కలు.. ఇవి ఎక్కడైనా శిల్పారామంలో కనిపించే దృశ్యాలు.. అలాంటి శిల్పారామం నెల్లూరు నగరంలో ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. నగరంలోని హైవే పక్కన బుజబుజనెల్లూరు చెరువు దగ్గర శిల్పారామానికి స్థలం మంజూరు చేసింది. నిర్మాణాలకు రూ. 3.65లక్షలు కేటాయించింది. నగరంలోని శిల్పారామం పనులు శరవేగంతో పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి (నేటి) పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నిర్మాణ పనులను పరిశీలించి శిల్పారామానికి అదనపు ఆకర్షణగా బుజబుజనెల్లూరు చెరువులో బోటు షికారును ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. అలాగే శిల్పారామాన్ని మూడునెలల్లో పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తామని హామీ కూడా ఇచ్చారు.


బుజబుజ నెల్లూరులో శిల్పారామానికి కేటాయించిన స్థలం

నగర శిల్పారామంలో స్వాగత ద్వారం, కళావేదిక, ఆఫీసు భవనం, స్టాల్స్, టాయిలెట్స్, ప్రహరీగోడ, ఫంక్షన్ హాలు, డ్రైనేజీ సౌకర్యం, ఫుడ్ కోర్టుల నిర్మాణాలు మంజూరయ్యాయి. అధికారులు టెండర్లు పిలవడం పూర్తయి, దాదాపు 50 శాతం నిర్మాణ పనులు జరిగాయి. ఈ పనులను నగర ప్రజలు ఆసక్తిగా తిలకిస్తూ ఎప్పుడు పూర్తవుతాయా... అని ఆసక్తిగా ఎదురు చూశారు.కానీ ప్రజలు ఆశలు, ఆకాంక్షలు ఆవిరికావడంతోపాటు నెల్లూరు నగరవాసులుకు శిల్పారామం అందని ద్రాక్షలా మారింది.

● హైకోర్టు ఆదేశాలతో నిర్మాణాలకు బ్రేక్

నగరానికి కొత్త హంగుల్లో భాగమే శిల్పారామం. అబివృద్ధిని ఓర్చుకోలేని ఒకరు బుజబుజనెల్లూరు చెరువులో శిల్పారామం నిర్మిస్తే పర్యావరణం కాలుష్యంతోపాటు పశువులకు, ప్రజలకు తాగునీటికి ఇబ్బంది వస్తుందని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో శిల్పారామం పనులు ఆపివేయాలని హైకోర్టు స్టే ఆర్డరు ఇచ్చింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శిల్పారామం పనులు అటకెక్కాయి. శిల్పారామం ప్రాంతాన్ని, నిర్మాణం జరిగిన కట్టడాలకు భద్రత కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. వైసీపీ ప్రభుత్వం శీతకన్ను వేయడంతో గత ఆరేళ్లుగా ప్రజలకు శిల్పారామం కనుమరుగైంది. ఆ ప్రాంతం పిచ్చిచెట్లతో చిట్టడివిగా మారింది. ప్రజాధనం నేలపాలైంది. కూటమి ప్రభుత్వం నెల్లూరు నగరానికి, ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు మరోచోట స్థలం కేటాయించి శిల్పారామం నిర్మించాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని శిల్పారామాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.


డంపింగ్ యార్డులా శిల్పారామం స్థలం


చిల్ల చెట్లతో నిండిన శిల్పారామం ముఖద్వారం

శాంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శాంతినగర్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నిర్మల ఏజెన్సీ అధినేత సింగారెడ్డి నిర్మల నరసింహారెడ్డి 73వ జన్మదినం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి నిర్వాహకులు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో షుగర్, ఈసీజీ, ఎక్స్‌రే, మామొగ్రామ్, క్యాన్సర్ వ్యాధులకు ఉచిత చికిత్స అందించారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఫ్రీ ఓపీ కూపన్లు మెడికవర్ ఆసుపత్రి వారు అందచేశారు. అన్ని వైద్య పరీక్షలు 30 శాతం రాయితీతో పాటు ఫ్యామిలీ కార్డులు కూడా అందచేశారు. ఈ కార్యక్రమంలో వేలూరు రంగారావు, రమణారెడ్డి, జీవీ రత్నం, బలరామనాయుడు, సురేష్, పోబోలు సత్యనారాయణ, సుధాకర్, లీలా మోహన్ రెడ్డి,రామానాయుడు, డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కిరణ్మయి, వాసన్ ఐకేర్ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

నెల్లూరురూరల్,మే 31,(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం వీఆర్సీ కూడలి వద్ద వీఆర్సీలో (1983-86 మధ్య) చదువుకున్న విద్యార్థులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా సేవ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషమని తెలిపారు.


మజ్జిగ పోస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

డ్రైనేజీ కాలువలన్నింటిలో పూడికతీత

నెల్లూరు(సిటీ),మే 31,(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత చేపట్టామని కమిషనర్ నందన్ తెలిపారు. శనివారం నగరంలోని 4వ డివిజన్ రాంనగర్, 40వ డివిజన్ వాకర్స్‌రోడ్డు ప్రాంతాల్లో పూడికతీతను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున ముందస్తు ముందస్తుగా కాలువలన్నింటిల్లోనూ పూడిక తీస్తున్నామన్నారు. వర్షపునీరుతోపాటు మురుగునీళ్లు సులువుగా బయటకు వెళ్లేందుకు వీలుగా పూడిక పనులు వేగవంతంగా చేస్తామని తెలిపారు. అనంతరం పాతమున్సిపల్ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.


కాలువలో పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్

పౌష్టికాహారం పంపిణీ అభినందనీయం

నెల్లూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారుల్లో, బాల,బాలికల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు నిత్యం ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం అభినందనీయమని ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీనివాసరాజు అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాతలు జీవీ.రత్నం, వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే.గోపీనాథ్, నేతలు డీవీ.సుబ్బరాజు, ఖలీల్‌బేగ్, కేఎంకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు పౌష్టికాహారం అందిస్తున్న ప్రతినిధులు

చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఓ చిన్నారి(6)కి అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. పొదలకూరు మండలం అమ్మవారిపాళెంకు చెందిన సురేష్ (6)కి పుట్టుకతోనే మలాశయం సమీపంలో నాడీ కణాలు లేకపోవటం వల్ల మల విసర్జనకు అవరోధం ఏర్పడిందని పేర్కొన్నారు. ఇది హిర్ష్‌స్ప్రంగ్ వ్యాధిగా గురించామన్నారు. ఈ నేపథ్యంలో దుహామెల్ రెట్రోరెక్టర్ పుల్ త్రో అనే శస్త్రచికిత్స నిర్వహించి, కొలన్ భాగాన్ని మలాశయ వెనుక భాగం దిగువకు లాగి, మలాశయం వెనుక భాగానికి అనుసంధానం చేశామని వివరించారు. ఇప్పుడు మలవిసర్జన సాధారణస్థితికి వచ్చిందన్నారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ఇలాంటి కేసు ఇదేనని మొదటిదని చెప్పారు. లెవల్ 3 ఎన్‌ఐసీయు, నియోనెటాలజిస్ట్ డాక్టర్ గోకులకృష్ణన్‌తోపాటు నిష్ణాతులైన వైద్య బృందం ఉండటంతో ఈ శస్త్రచికిత్సను విజయ వంతంగా నిర్వహించామని వారు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పథకం కింది ఈ శస్త్రచికిత్సను ఉచితంగా చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత, డాక్టర్ రజిత, టీడీపీ నాయకుడు గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్

అందరి సమన్వయంతో హెచ్ఐవీని నివారించాలి

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి) :వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో జిల్లాలో హెచ్ఐవీ నివారణకు పాటుపడాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. శనివారం జీజీహెచ్ లోని ఏఆర్‌టీ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ హెచ్ఐవీ రోగులకు మందులు పంపిణీ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ తీవ్రత లేని జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం హెచ్ఐవీ కేసులు తగ్గినప్పటికి ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల

లింగసముద్రం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని తిమ్మారెడ్డిపాలెంలో వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల వైభంగా జరిగింది. ఈ సం దర్భంగా ముందుగా శుక్రవారం రాత్రి భక్తులు స్వామి వారిని గ్రామంలో ఊరేగిం చి, నేతికడవ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు కట్ట దిగువన ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ మంగారావు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా సీతారామ కల్యాణం


సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తోటపల్లిగూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోడూరు వెంకటేశ్వర మత్స్యకారపాలెంలోని రామాలయంలో శనివారం సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. శ్రీరామ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కామాక్షితాయికి వైభవంగా వడాయితీ ఉత్సవం


జొన్నవాడలో ఊంజలసేవలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునుడు

బుచ్చిరెడ్డిపాళెం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో జరుగుతున్న వడాయితీ ఉత్సవాల్లో భాగంగా 4వరోజు శనివారం ఆలయ కుంభహారతి, ప్రత్యేక పూజలు నిర్వహజుచారు. మండపంలో ఏర్పాటు చేసిన ఊయలలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామిని కొలువుదీర్చి నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఊయల సేవ భక్తులను అలరించింది.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


వాకా శ్రీనివాసులును సన్మానిస్తున్న స్నేహితులు

పొదలకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త కంబాలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా శ్రీనివాసులును పదవీ విరమణ సందర్భంగా ఆయన స్నేహితులు, శ్రేయోభిలాషులు స్థానిక జమున హాల్ సెంటర్‌లో శనివారం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ్ల శ్రీనివాసులు, లెక్చరర్ పచ్చిపాల పెంచలయ్య, పెంచల్‌రెడ్డి, సుబ్బారావు, నాగేశ్వరరావు, కాకుమాని జగదీష్, సులేమాన్, నాగయ్య, పెళ్లూరు వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లలో ఆనందం చూడడమే లక్ష్యం

● పెన్షన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), మే 31(ఆంధ్రజ్యోతి): అవ్వాతాతల కళ్లలో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలకశాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరంలోని జాఫర్ సాహెబ్ కాలువకట్ట ప్రాంతంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక రోజు ముందుగానే పెన్షన్‌ల పంపిణీ జరిగిందన్నారు. ఎన్నికలకు ముందు మండుటెండలో వైసీపీ వృద్ధులను ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. ఎన్నికలలో పెన్షన్‌ను రూ. 4వేలకు పెంచుతామని ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి ఖజానా ఖాళీ అయినా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.


పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నూర్‌బాషాలకు మోడల్ కమ్యూనిటీ హాలు నిర్మిస్తాం

రాజ్యసభ సభ్యుడు బీఎమ్మార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నెల్లూరు (సాంస్కృతికం) మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో నూర్‌బాషాలకు మోడల్ కమ్యూనిటీ హాలు నిర్మించి ఇస్తామని రా జ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు హామీ ఇచ్చారు. శనివారం టౌనుహాలులో జరిగిన నూర్‌బాషా విద్యార్థుల ప్రతిభా పురస్కారాల పంపిణీ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 10వతరగతి, ఇంటర్‌లో ప్ర తిభ చాటిన నూర్‌బాషా విద్యార్థులకు బీ ఎంఆర్ ట్రస్ట్ ద్వారా ఆయన ప్రతిభా పుర స్కారాలు అందజేశారు. నూర్‌బాషా సం క్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సలీమ్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహ మ్మద్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాబన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, యూత్ అధ్యక్షుడు మస్తాన్, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతల అన్నదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తల్లిదండ్రులు అనంతరామయ్య, కామేశ్వరి వివాహ దినోత్సవ సంస్మరణార్థం శనివారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు గునుకుల కిషోర్ మాట్లాడుతూ సంఘ సేవకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, పలు అంతర్జాతీయ శాంతి సదస్సుల్లో అప్పట్లోనే నెల్లూరు నుంచి వేములపాటి అనంతరామయ్య పాల్గొనడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుందరరామిరెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, జమీర్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

ముమ్మరంగా ఎడగారు వరినాట్లు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : మండల రైతులు ఎడగారు సాగులో నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో 19 వేల ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. మోపూరు మట్టం, అల్లూరు చెరువు, రామన్న చెరువు ఆయకట్టుల పరిధిలోని భూముల్లో అధికారికంగా అనధికారికంగా 40 వేల ఎకరాల్లో రబీ సీజనులో వరిసాగు చేపడుతారు. అయితే అత్యధిక విస్తీర్ణం లోతట్టు ప్రాంతంలో ఉండగా ఆ ప్రాంతంలో వరి కోతల సమయంలో వర్షాలు సంభవిస్తే గింజ ధాన్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి కారణంగా స్వాంపు ప్రాంతాల్లోని భూముల్లో రైతులు ఎడగారు వరిసాగు చేపట్టేందుకు ఆసక్తి చూపరు. ఈ క్రమంలో మిగిలిన ప్రాంతమంతా భూముల్లో రైతులు 10 శాతం మంది భూములను చదును చేసి విత్తనాలను నేరుగా పొలాల్లో చల్లగా మరికొంతమంది డ్రమ్‌సీడర్‌ను వినియోగిండం, మిగిలిన 90 శాతం మంది వరినాట్లుకే మొగ్గు చూపుతున్నారు. ఖర్చులను తగ్గించుకునే క్రమంలో విత్తనాల చల్లకం, డ్రమ్‌సీడర్ వినియోగిం చేపడుతున్నామని రైతులు తెలుపుతున్నారు.


బుచ్చి-జొన్నవాడ మార్గంలో రక్షణ గోడలు లేని కోవూరు కాలువ కల్వర్టు

కల్వర్టులకు రక్షణ గోడలు కరువు

బుచ్చిరెడ్డిపాళెం, మే 31(ఆంధ్రజ్యోతి): నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే పలు మార్గాల్లో నీటిపారుదల కాలువల కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో పాటు రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో వాహనదారులు ప్రమాదపుటంచుల్లో ప్రయాణాలు సాగిస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతోన్నారు. బుచ్చి-జొన్నవాడ, కాకయకాగొల్లు-పెనుబల్లి మార్గాల్లో పలు చోట్ల కల్వర్టులకు రక్షణ గోడలు లేవు. దీంతో ఎక్కడ కల్వర్టు ఉందో తెలియని వాహనచోదకులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా నేటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని వాహన చోదకులు పలువురు ఆరోపిస్తున్నారు.

సోమశిలలో 42.486 టీఎంసీల నీరు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 42.486 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 652 క్యూసెక్కులని తెలిపారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత గల రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని, వారు పథకానికి అర్హత సాధించిన వారి జాబితాను ఆయా రైతుసేవా కేంద్రాలకు పంపడం జరుగుతుందన్నారు. ఆ జాబితాలో పేర్లున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

సిటీ ప్లానింగ్ అధికారులతో మంత్రి సమీక్ష

నెల్లూరు(సిటీ),మే 31,(ఆంధ్రజ్యోతి) : నగరంలో భవనాల అనుమతులు, ఇతర అంశాలపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం కార్పొరేషన్‌లో సిటీప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ పత్రాలు సరిగా ఉంటే వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేయాలని స్పష్టం చేశారు. పత్రాలు సరిలేకపోతే అధికారులే సదరు భవనాల వద్దకు వెళ్లి పరిశీలించి తగిన దస్త్రాలను సమీకరించి అక్కడిక్కడే అనుమతులివ్వాలన్నారు. పత్రాలే లేని భవనాలను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవన అనుమతులు జారీలో రాష్ట్రానికే నెల్లూరు ఆదర్శంగా ఉండాలని వెల్లడించారు. ప్రతీ పది రోజులకొకసారి ప్లానింగ్ శాఖ డైరెక్టర్ విద్యులత నెల్లూరుకు వచ్చి పరిస్థితిని పరిశీలిస్తారని తెలిపారు. ప్రస్తుతం 30 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వాటిల్లో 16 దరఖాస్తులను అక్కడిక్కడే పరిశీలించి తగిన పత్రాలను సదరు వ్యక్తులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష అనంతరం మాట్లాడుతున్న మంత్రి నారాయణ, వేదికపై నుడా చైర్మన్ కోటంరెడ్డి, కమిషనర్ నందన్

నేడు మంత్రి పార్థసారథి రాక

నెల్లూరు(హరనాథపురం), మే31(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర గృహ నిర్మాణ, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం ఉదయం 11.30 గంటలకు నెల్లూరుకు వస్తారని డీడీఐపీఆర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని యాదవ భవన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

నెల్లూరుపై మూడో కన్ను నిఘా

- 300 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ
- పోలీస్, కార్పొరేషన్లలో కమాండ్ కంట్రోల్ రూమ్స్

నెల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరులో కొన్నేళ్లుగా అశాంతి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేగా మంత్రి నారాయణ దీనికి పరిష్కారం కోసం పోలీస్ అధికారులతో చర్చలు జరిపారు. నగరం మొత్తాన్ని కాపుకాచే శక్తివంతమైన నిఘా నేత్రాల వ్యవస్థ ఏర్పాటు చేస్తే చాలా వరకు నేరాలను నియంత్రించవచ్చని గుర్తించారు. ఈ వ్యవస్థ ద్వారానే నగరంలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపరచవచ్చని నిర్ణయించుకున్నారు. ఇందుకు అవసరమైన నిధుల వితరణ కోసం యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశారు. కార్పస్ ఫండ్ కింద రూ.3 కోట్లు ఇవ్వడానికి వారు అంగీకరించారు. ఆ నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేసింది.

300 కెమెరాలు

నగర వ్యాప్తంగా కీలకమైన ప్రదేశాలను పోలీసులు, కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. నగరం మొత్తం కవరయ్యేలా 300 సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయించుకున్నారు. ఈ విషయమై శుక్రవారం రాత్రి మంత్రి నారాయణ నివాసంలో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ, డీఎస్పీలు, కార్పొరేషన్ కమిషనర్ నందన్, ఇతర సిబ్బందితో సమావేశమై తుది ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.


శక్తివతమైన వైర్‌లెస్ కెమరాలు:

నేరస్థులను గుర్తించడానికి శక్తివంతమైన కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నేరాలకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, ఇరుకు ప్రదేశాల్లో అమర్చడానికి వీలుగా లేటెస్ట్ ఫీచర్స్ కలిగిన కెమెరాలను కొనుగోలు చేస్తున్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా వైర్‌లెస్ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

రెండు కమాండ్ కంట్రోల్ రూములు

రక్షణ పరంగా అటు పోలీసు వ్యవస్థకు, పారిశుధ్య పరంగా ఇటు మున్సిపల్ కార్పొరేషన్‌కు అవసరాలను తీర్చే విధంగా రెండు కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాలన్నీ ప్రస్తుతం పాత ఎస్పీ ఆఫీసులో ఉన్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, కార్పొరేషన్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానించబడతాయి. ఈ రెండు శాఖలు తమకు సంబంధించిన అంశాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తాయి. నెల రోజుల్లో ఈ నిఘా వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

ఎత్తిపోతల పథకం నుంచి ప్రవహిస్తున్న నీరు



అన్నదాతల ఆదర్శం!

ఆదివారం ప్రత్యేకం

- ఎత్తిపోతల పథకం నిర్వహణలో స్ఫూర్తి పథం
- మూడున్నర దశాబ్దాలుగా ఏకతాటిపై నిర్వహణ
- వాటాలు వేసుకుని ఖర్చులు భరిస్తున్న వైనం
- డెల్టాకు పోటీగా 800 ఎకరాల్లో వరి సాగు



ఎత్తిపోతల పథకానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు

సంగం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలంలోని కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాలు మెట్ట ప్రాంతాలు. కొరిమెర్లలో రెండు, తలుపూరుపాడులో ఒక చెరువు ఉంది. ఈ చెరువుల కింద సుమారు 800 ఎకరాల ఆయకట్టు ఉండగా, వర్షం కురిస్తేనే చెరువుల్లోకి నీరు వచ్చేది. దీంతో ఈ రెండు గ్రామాల నాయకులు ఐకమత్యంతో మూడున్నర దశాబ్దాల కిందట ఐడీసీ పథకంలో నిధులు మంజూరు చేయించుకుని ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. 50 హార్స్‌పవర్ ఆరు మోటార్ల ద్వార బీరాపేరు వాగులో నుంచి నీటిని సరఫరా చేస్తారు. పొలాల వాటా ప్రకారం కొరిమెర్లలోని రెండు చెరువులకు మూడున్నర రోజులు, తలుపూరుపాడు చెరువుకు రెండున్నర రోజుల చొప్పున నీటిని సరఫరా చేసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. 24 గంటల కరెంటు సరఫరా, పెన్నానదిలోని బ్యాక్ వాటర్‌తో ఈ పథకం నడుస్తుంది. నీరు సమృద్ధిగా డెల్టాతో సమానంగా వరిసాగు చేస్తున్నారు.

నిర్వహణ రైతులదే

ఐడీసీ ప్రాజెక్టు అధికారులు పథకం నిర్మించి రైతులకు అప్పగించారు. ఆ తర్వాత నిర్వహణ బాధ్యతలు రైతులే భరించుకుంటున్నారు. పథకం ఆపరేటింగ్, కాపలాదారులకు ఏడాదికి రూ1.5 లక్షలు ఖర్చు అవుతుంది. మోటార్ల రిపేరు తదితర ఖర్చులు మరో 50 వేలు ఉంటుంది. అంటే ఏడాదికి సుమారు రూ2 లక్షలు. దీన్ని రైతులే వాటాలు వేసుకుని భరిస్తున్నారు. కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాల్లో పార్టీలు, వర్గాలు ఉన్నా ఎత్తిపోతల పథకం విషయంలో ఏడాదిలో ఏరువాక నాడు సమావేశమై సమష్టి నిర్ణయంతో వాటాలు వేసుకుంటున్నారు. దీంతో ఏడాది పొడవునా డెల్టాతో సమానంగా వరిసాగు చేసి మెట్టలో మూడు దశాబ్దాలుగా వరిసాగు చేస్తూ ఎత్తిపోతల పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న కొరిమెర్ల, తలుపూరుపాడు రైతులు ఆదర్శనీయులు.

రాజకీయాలకు అతీతంగా నిర్వహణ



రెండు గ్రామాల్లో రైతులు వేర్వేరు రాజకీయ పార్టీలు, వర్గాలు ఉన్నా ఎత్తిపోతల పథకంలో మాత్రం ఏకతాటిగా నడుస్తాం. ఎప్పుడూ ఎలాంటి పేచీ లేదు. ఏడాదిలో ఒకసారి అందరం కూర్చొని సమష్టిగా నిర్ణయం తీసుకుని నడుస్తున్నందుకు ఆనందంగా ఉంది.

- షేక్ బాబు, నీటిసంఘం అధ్యక్షుడు



పాలు.. పోషకాలు మెండు !

- రైతులకు జీవనోపాధిగా పాడిపరిశ్రమ
- నేడు ప్రపంచ పాల దినోత్సవం

నెల్లూరు(వ్యవసాయం), మే 31(ఆంధ్రజ్యోతి): పోషకాల పరంగా చూస్తే పాలకు మించిందేదీలేదు. ప్రతి రోజు గ్లాసు పాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నది వైద్యులతోపాటు సన్నిహితులు సాధారణంగా చెప్పే మాట. ఎముకల ఆరోగ్యంతోపాటు కండరాల అభివృద్ధికి, రోగనిరోధక శక్తికి పాలు ఎంతో అవసరం అన్నది అందరికీ తెలిసిందే. అయితే పాడి పరిశ్రమ అభివృద్ధికి, ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జూన్ 1న (నేడు) ప్రతి ఏటా ప్రపంచ పాల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో లక్షమందికి ఉపాధి



జిల్లాలో సుమారు లక్ష మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గేదెలను పోషించేవారు 80వేలకు పైగా ఉండగా, కేవలం ఆవులను పోషించేవారు 15వేలకుపైగా ఉన్నారు. వీరంతా పాడిపైనే ఆధారపడినట్లు పశుసంవర్ధకశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 6,46,116 నల్ల పశువులు, 57,746 తెల్ల పశువులు ఉన్నాయి. ఇందులో 5,96,393 నల్ల పశువులు, 47,131 తెల్ల పశువులు మాత్రమే పాలిచ్చేవి. సాధారణ పరిస్థితుల్లో తెల్ల పశువులు సరాసరి 5 నుంచి 7లీటర్ల వరకు పాలిస్తాయి. అలాగే నల్ల పశువులు 5 నుంచి 10లీటర్ల వరకు దిగుబడి ఉంటుంది. ఈక్రమంలో జిల్లాలో ఒక్క రోజులో సరాసరి పాలదిగుబడి 25.34లక్షల లీటర్లని పశుసంవర్ధకశాఖ అధికారుల అంచనా. లీటరు పాలు సరాసరి రూ.60ల నుంచి రూ.80ల వరకు బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. పాలతో పాటు పాల ఉత్పత్తులతో లక్షల మందికి జీవనోపాధి కలుగుతోంది.

పాలు సంపూర్ణ పోషకాహారం

పాలు సంపూర్ణ పోషకాహారం. అన్ని రకాల పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, మాంసకృత్తులు, లవణాలు, విటమిన్లు మొదలైనవి ఉంటాయి. ఇవన్నీ సులభతరంగా జీర్ణమయి శరీరానికి అవసరమయ్యే శక్తిని వెంటనే ఇస్తాయి. పాలలో విటమిన్స్, అమినో ఆమ్లాలు ఉండడం వల్ల వ్యాధినిరోధకశక్తి పెంపొందిస్తాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులకు ఇవి చాలా ఉపయోగంగా ఉంటాయి.

- డాక్టర్ బీ.కృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్

ఏం జరుగుతుందో!?

- బదిలీలపై ఉపాధ్యాయుల్లో వీడని ఆందోళన
- భారీగా వస్తున్న అభ్యంతరాలు
- ఎస్జీటీల స్థానచలనాలపై సందిగ్ధత

నెల్లూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటివరకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీలు, ఎస్ఏలకు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలకు ఉద్యోగోన్నతి ప్రక్రియ వివాదాల నడుమ పూర్తి చేశారు. ఇకపై అసలు గందరగోళం ప్రారంభం కానుంది. ఎస్ఏల బదిలీలు, ఎస్జీటీల బదిలీలతో జిల్లాలో కోలాహలం నెలకొననుంది. ఇప్పటికే వీరి దరఖాస్తు ప్రక్రియ పూర్తికాగా అభ్యంతరాలను స్వీకరించి పరిశీలిస్తున్నారు. వీటిలో అన్ని రకాల సమస్యలను పొందుపరిచి అప్రమత్తంగా లేకుంటే స్థానాలు పొందే విషయంలో తమకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. బదిలీల్లో పాయింట్లే కీలకం కావడంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా స్పౌజ్ విషయంలో కొందరు ఉపాధ్యాయులు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి వీటన్నిటిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



నేటి నుంచి ఎస్ఏల బదిలీలు

ఆదివారం నుంచి ఎస్ఏల బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 1289 మంది 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవడంతో వీరు తప్పనిసరి బదిలీ కానున్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడంతో ప్రాథమిక సీనియారిటీ జాబితాను సబ్జెక్టుల వారీగా విడుదల చేశారు. వీటిపై భారీగా అభ్యంతరాలు రావడంతో వీటిని పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శనివారం రాత్రికి సీనియారిటీ తుది జాబితాను సబ్జెక్టుల వారీగా ప్రకటిస్తామని అధికారులు చెపుతున్నారు. ఈ జాబితాలను ఆమోదిస్తే జూన్ 1, 2వ తేదీల్లో బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం 4వతేదీన బదిలీ ఉత్తర్వులు అందచేస్తారు. 5న అర్హులైన ఎస్జీటీలకు ఎస్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. దీనికోసంగా ఎస్జీటీలు తాము కోరుకునే స్థానాలకు వెబ్ ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. 6వతేదీన స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందచేస్తారు.

174 మంది ఉద్యోగోన్నతులు

జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్ఎంలకు 103 మంది బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు అందచేశారు. ఖాళీ అయిన స్థానాలను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 89 మందికి, మున్సిపాలిటీలో 4 కలిపి మొత్తం 93 మంది ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా 82 మంది దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్ నిర్వహించి 81 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. మొత్తం మీద 174 మందికి ఉద్యోగోన్నతి కల్పించినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.

ఎస్జీటీలకు ఆన్‌లైన్‌లోనేనా?

ఎస్జీటీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా!? లేదా మ్యాన్యువల్‌గా అన్నదానిపై అనిశ్చితి నెలకొని ఉంది. జిల్లాలో ఎస్జీటీలు 2,927 మంది దరఖాస్తు చేసుకోగా ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 1487 మంది ఎస్జీటీలు తప్పనిసరి బదిలీ కానున్నారు. మిగిలిన వారు బదిలీలు కోరుకుంటున్నారు. అయితే వీరి సంఖ్య అధికం కావడంతో పాఠశాలలను ఎంపిక చేసుకోవాల్సిన అంశం కీలకంగా మారనుంది. గరిష్ఠంగా 2వేల ఆప్షన్లు ఇవ్వాల్సి రావడంతో వీరంతా తమకు మ్యాన్యువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీరికి సంబంధించిన ప్రాథమిక సీనియారిటీ జాబితాను శనివారం విడుదల చేస్తారు. అభ్యంతరాలను స్వీకరించి 2వతేదీ వరకు పరిశీలన, జూన్ 6న తుది సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు. అయితే వీరికి వెబ్‌ఆప్షన్‌లా లేక మాన్యువల్‌గానా అన్న అంశంపై మాత్రం ఖచ్చితమైన ఆదేశాలు రావాల్సి ఉంది. దీనికోసం అందరూ వేచి చూస్తున్నారు. ఉత్తర్వులు వస్తే జూన్ 7 నుంచి 10వతేదీ వరకు ఎస్జీటీలు కోరుకున్న స్థానాలకు ప్రాధాన్యత క్రమంలో అవకాశం కల్పించి. జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



పాడి రైతుకు బీమా భరోసా!

- ప్రీమియం తగ్గింపుతో తగ్గిన భారం
- పశువుల సంఖ్య రెట్టింపు

ఉదయగిరి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయం తరువాత అధిక శాతం మంది రైతులకు పశువులు, గొర్రెలు, మేకల పెంపకమే జీవనధారం. అయితే, దాణా, పశుగ్రాసం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతోపాటు కొరత ఏర్పడుతోంది. దీంతో పాడి రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. అధిక పెట్టుబడులు పెట్టి పశు పోషణ తలకు మించిన భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో పాడి రైతుకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పశు బీమా పథకంలో మార్పులు తీసుకొచ్చింది. జిల్లాలో 6,46,106 గేదెలు, 57,774 ఆవులు, 10.95 లక్షల గొర్రెలు, 3.86 లక్షల మేకలు ఉన్నాయి. వీటిని పోషించే యజమానులకు బీమా పథకంలో తీసుకొచ్చిన మార్పులు వరంగా మారాయి. రైతు చెల్లించాల్సిన వాటాను తగ్గించడంతోపాటు అధిక పశువులు, మూగజీవాలకు పథకం వర్తించేలా రూపకల్పన చేయడం గమనార్హం. గత నెల నుంచి ఈ మార్పులు అమలులోకి రాగా, అధికారులు పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- గతంలో ఐదు పశువులకే ఈ పథకం వర్తిస్తుండగా, ఆ సంఖ్యను పదికి పెంచారు. అలాగే గొర్రెలు, మేకలను సైతం 50 నుంచి 100 పెంచారు..
- గతంలో 20 శాతంగా ఉన్న రైతు వాటా ప్రీమియంను 15 శాతానికి కుదించి వారిపై ఆర్థిక భారం తగ్గించారు. అలాగే ఒకసారి ప్రీమియం చెల్లిస్తే చాలు మూడేళ్ల వరకు పథకం అమలులో ఉంటుంది.
- నాటు పశువులకు రూ.816, మేలుజాతి పశువులకు రూ.1,632 వరకు చెల్లించాల్సి ఉంటుంది.
- దరఖాస్తు చేసుకున్న వెంటనే బీమా వర్తిస్తుంది.
- పశు సిబ్బంది తమ వంతు బాధ్యతగా ప్రత్యేక సంఖ్యతో ఉన్న కమ్మను పశువులు, మూగజీవాల చెవులకు అమర్చి, వాటి ఆధారంగా బీమా నగదు అందేలా చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పశుబీమాలో ప్రభుత్వం తెచ్చిన మార్పులు పాడి రైతులకు ఎంతో అనుకూలం. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యం తీసుకొస్తున్నాం. పశువులు, జీవాల యజమానులు సైతం పథకం కింద ప్రీమియం చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.

- ఎస్‌వీ రాఘవేంద్రశర్మ, పశువైద్యాధికారి

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు

- డీలర్లు అక్రమాలకు పాల్పడితే అక్కడికక్కడే చర్యలు
- పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ పట్టాభి రామిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి చెప్పారు. శనివారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలోలా డీలర్లు అక్రమాలకు పాల్పడితే అక్కడికక్కడే చర్యలు తీసుకోవటం, కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. డీలర్లు కూడా సక్రమంగా సరుకులు పంపిణీ చేస్తూ ప్రజా మన్ననలను చూరగొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. కొత్తకార్డులు, ఉన్న కార్డులలో మార్పు చేర్పులకు కోసం ఇప్పటి వరకు 41,678 దరఖాస్తులు అందాయని చెప్పారు. వాటిలో 7,415 దరఖాస్తులను ఆమోదించారని తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు ఈ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వివరించారు. 7 నుంచి 21 రోజుల లోపు దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.



మలేరియా మాసోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

మలేరియా మాసోత్సవాలను సమర్థంగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 (ఆదివారం) నుంచి జూన్ 30 వరకు జరిగే మలేరియా మాసోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. మలేరియా మాసోత్సవాల పోస్టర్లను శనివారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల పట్ల జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు పీహెచ్‌సీల్లో జ్వరాలు ప్రబలకుండా చూడాలన్నారు. మలేరియా నివారణకు చర్యలు తీసుకుని, ప్రజలకు అవగాహన కలిగించాలని తెలియచేశారు. మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే జరగాలన్న నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్‌హెచ్ఎం పీవో డాక్టర్ రమేష్, డాక్టర్ భాస్కర్ రావు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి దుర్మరణం



బావిలో పడి మృతి చెందిన మహబూబ్ బాషా

సీతారామపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుంటమడుగు వాగు సమీపాన గల ఎర్రగుంట్ల బావిలో శనివారం చేపలు పట్టేందుకు వెళ్లి రాజుగారి కాలనీ ప్రాంతంలోని మంగలి వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ బాషా దర్గాల వద్ద ముజావర్‌గా ఉంటూ గ్రామంలో పాత ఇనుముకి ఎర్రగడ్డలు ఇచ్చే వ్యాపారం చేసేవాడు. ఖాళీ సమయంలో చేపలు పట్టే అలవాటు ఉండడంతో శనివారం గాలం తీసుకుని ఎర్రగుంట్ల బావి వద్దకు చేరుకుని చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందాడన్నారు. సాయంత్రం బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకులు నీళ్లపై తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు బావి వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ యువతి మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాలెం గ్రామానికి చెందిన బత్తుల శివప్రియ (22) అనే యువతి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. అయితే ఆ యువతిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు, అనంతరం చెన్నైలోని మరో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆ యువతి శనివారం మృతిచెందింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

డీజీపీని కలిసిన పోలీసు అధికారుల సంఘం నేతలు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీహరి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తాను శనివారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో ఆంధ్రపదేశ్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా పోలీసు అధికారుల సంఘం అసోసి యేట్ అధ్యక్షుడు వై శ్రీహరి మాట్లాడుతూ కొంత కాలంగా ని లుపుదల చేసి ఉన్న మ్యారేజ్, ఎడ్యుకేషన్, మెడికల్ రుణా లను పెంపుదల చేసి సున్నావడ్డీకి మంజూరు చేస్తూ డీజీపీ ఆదేశాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు



కలెక్టరేట్ ఎదుట వైసీపీ నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (క్రైం), మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, వచ్చిపోయే వారిని ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నాయకులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన కేసును సీబీఐకు అప్పగించాలని కోరుతూ శనివారం కాకాణి కుమార్తె పూజితారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు ఆనం విజయ్‌కుమార్ తదితరులు కలెక్టరేట్‌లోని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో భారీగా కలెక్టరేట్‌కు చేరుకున్న వైసీపీ నాయకులు పోలీసులు వారిస్తున్నా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కలెక్టర్‌కు వచ్చిపోయే వారిని ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రజా శాంతికి భంగం కలిగే రీతిలో ప్రవర్తించారు. దీంతో చిన్నబజారు పోలీసులు వైసీపీ నాయకులు మందల వెంకటశేషయ్య, మెట్టా విష్ణువర్ధిక రెడ్డి, ఇంద్రసేన గౌడ్, అబ్దుల్ మస్తాన్, షేక్ సిద్దిక్, బొబ్బల శ్రీనివాస యాదవ్, రావు శ్రీనివాసరావు ఉరాఫ్ ఆర్ఎస్ఆర్, సత్తార్, మోయళ్ళ సురేష్, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, మరి కొందరిపై కేసులు నమోదు చేశారు.

సోమశిలలో 42.486 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 42.486 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 652 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,450, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9188
వెండి కిలో ధర	రూ. 99500
వెండి ఒక గ్రాము	రూ. 102.50

పడమటి గాలుల హోరు.. ప్రజలు బేజారు

- నేలకొరుగుతున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతంలో పడమటి గాలులతో ప్రజలు బేజారవుతున్నారు. అర్ధరాత్రి 12 నుంచి మొదలైన గాలులు మరుసటి రోజు 11 గంటల వరకు వీస్తున్నాయి. దుమ్ము, ధూళితో నివాసాలు నిండిపోతున్నాయి. ఈ గాలులతో చెట్ల కొమ్మలు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు నేలకొరుగుతున్నాయి. పందిళ్లు, గేదెల రేకులషెడ్‌లు సైతం గాలుల ధాటికి లేచిపోతునాయి. కొండప్రాంతానికి సమీపాన ఉన్న గ్రామాల్లో గాలులు అధికంగా ఉన్నాయి. గాలుల దెబ్బకు చెట్లకు


గాలుల ధాటికి నేలకొరిగిన బోర్డు

అరకొరగా ఉన్న మామిడి కాయలు సైతం నేలకొరుగుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

జోరుగా వీస్తున్న గాలులతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో ఇటు వినియోగదారులు, అటు ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, తీగలు గాలులకు తెగిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు సైతం షార్టుసర్క్యూట్ జరిగి కాలిపోతున్నాయి. మరోవైపు చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడడంతో వాటిని సరిచేసేందుకు సిబ్బంది అగచాట్లు పడుతున్నారు. మరో నెలరోజులపాటు ఈ గాలులు తాకిడి ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● రాజేశ్వరరావు, నీటి పారుదల శాఖ ఏఇ

మర్రిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నీటి పారుదల శాఖ ఏఇ రాజేశ్వరరావు తెలిపారు.

ముఖాముఖి

? మండలంలో ఎన్ని చెరువులు ఉన్నాయి.

! మండలంలో 64 చెరువులు ఉన్నాయి.

? చెరువుల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు తయారు చేశారు.

! ఆపరేషన్ ఇన్ మెయింటెనెన్స్ (ఓఎన్ఎం) ద్వారా ప్రస్తుతం రూ. 20లక్షలు మంజూరయ్యాయి. వాటితో అత్యవసరమైన చోట రైతుల ఫిర్యాదుతో సమస్యలు పరిష్కరిస్తాం.

? చెరువుల నుంచి రైతులు మట్టిని తీసుకెళ్లాలంటే ఏం చెయ్యాలి.

! ఉన్నతాధికారుల ఆదేశాలతో క్యూబిక్ మీటర్‌కు ఒక్క రూపాయి చొప్పున చెల్లించి రైతులు వారి పొలాలకు మాత్రమే తోలుకునేందుకు అవకాశం ఉంది.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : మంత్రి ఆనం

సంగం, ఆత్మకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు పింఛన్లకు ఖర్చుచేస్తోందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సంగం మండలంలోని వీర్లగుడిపాడు గ్రామంలో పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఆనం గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేస్తున్నామని, పేదల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. జూన్ 12 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నూతన పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. భర్త చనిపోయిన వారికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో బి పావని, ఎంపీడీవో షాలేట్, తహసీల్దారు సోమ్లానాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


వీర్లగుడిపాడులో సీసీరోడ్డు నిర్మాణాన్ని ప్రాంభిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం

వీర్లగుడిపాడును అభివృద్ధి చేస్తాం

మూరుమూల వీర్లగుడిపాడు గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని వీర్లగుడిపాడు గ్రామ పంచాయతీలో ఆయన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర్లగుడిపాడు నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రూ. 25 కోట్లతో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపడతామని, ఇది పూర్తయితే వీర్లగుడిపాడు గ్రామానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. గ్రామంలో అన్నిం టినీ సిమెంట్ రోడ్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో బి పావని, ఎంపీడీవో షాలేట్, తహసీల్దారు సోమ్లానాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

అనంతసాగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నాయకులు సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి.. మతోన్మాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తకాల స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందజేయనున్న విద్యార్థిమిత్ర కిట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, బూట్లు, బెల్టు, యూనిఫాం దుస్తులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిమిత్ర కిట్లను పరిశీలిస్తున్న ఎంఈవో

న్యూస్ బాక్స్
వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహాలు

దుత్తలూరు (ఉదయగిరి), మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిత్యపూజ, యంత్రస్థాపన, కలశ ఆలయ ప్రవేశం, దర్పణ మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివార్లను ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు కాయా కర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

దుత్తలూరు(ఉదయగిరి), మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాజమాత రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రి నాయుడు, అందే రామయ్య, పెసల కృష్ణ, పుల్లారెడ్డి, నరేంద్ర, పులివర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత గల రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని, వారు పథకానికి అర్హత సాధించిన వారి జాబితాను ఆయా రైతుసేవా కేంద్రాలకు పంపడం జరుగుతుందన్నారు. ఆ జాబితాలో పేర్లున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి

మర్రిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా ఎరువుల యాజమాన్యం పాటించాలని హైదరాబాద్ నుంచి వచ్చిన శాస్త్రవేత్త డా. నాగేశ్వరరావు సూచించారు. శనివారం వివిధ పంటలకు సంబంధించిన శాస్త్రవేత్తలు కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో మండలంలోని పొంగూరు గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. విత్తన ఉత్పత్తి, మినుము, పెసర సాగులో మెళకువలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్ నాయక్, రాజేష్, మండల వ్యవసాయాధికారి మామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా నాగేశ్వరరావు

చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి), మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చౌక దుకాణాలను తహసీల్దారు వై నాగరాజు శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారులకు చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోందన్నారు. జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 5వ తేదీ లోపు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే నిత్యావసర వస్తువులు అందజేయడం జరుగుతుందన్నారు. కావున కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దారు నాగరాజు

జమ్ముమునేశ్వరుడికి ప్రత్యేక పూజలు

అనంతసాగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్మినగుంట వద్ద ఉన్న జమ్ముమునేశ్వరుని ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన వల్లూరు వెంకటరమణారెడ్డి, వారి కుటుంబసభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 571 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 394 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 177 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 200 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్లకు సన్మానం

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ సభ్యులుగా ఉండి కండక్టర్లుగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన పీవీ శేషగిరిరావు, సీహెచ్ హరిప్రసాద్, షేక్ అహ్మద్‌బాషాలను డిపో ఆవరణలో ఆ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్, ఎన్ఎంయూఏ మాజీ కార్యదర్శి మౌలాలీ, నాయకులు రమణరాజు, నాగరాజు, వెంకటేశ్వర్లు, సలాం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంత

● ప్రమాదాల బారిన వాహనదారులు

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ప్రధాన రహదారిపై వాల్వు గుంత ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాల్వు గుంతపై మూత ఉన్నా వాహన రాకపోకలతో పెద్ద గుంతగా మారి ప్రమాదకరంగా మారింది. రహదారిపై పెద్ద గుంత ఉండడంతో వాహనదారులు ఆ గుంతను తప్పించబోయి తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతోపాటు రాత్రి సమయాల్లో పాదాచారులు సైతం గుంతను గమనించిక రోడ్డుపై పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.


ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

11న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఏఎస్ పేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులు పైగా సాధించిన పద్మశాలి విద్యార్థులకు జూన్ 11వ తేదీన ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ తెలిపారు. శనివారం ఆయన ఏఎస్‌పేటలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. 500 మార్కులు సాధించిన విద్యార్థులు నెల్లూరులోని సిరి థియేటర్ ఎదురుగా ఉన్న లక్ష్మి శ్రీనివాస డిజిటల్ ప్లాజాలో మార్కులిస్టు, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సోమా గోపాల్, ప్రతినిధులు జానపాటి రామసుబ్బయ్య, జొన్నాదుల వేణుగోపాలయ్య, సోమల సంజీవయ్య, నారాయణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

నకిలీ ప్యారాచూట్ కొబ్బరినూనె

● కంపెనీ ప్రతినిధుల తనిఖీల్లో వెలుగులోకి..


దుకాణంలో ప్యారాచూట్ కొబ్బరినూనె ఆయిల్ బాటిల్స్ తనిఖీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో కల్తీలు, మోసాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రతి వస్తువులో కల్తీ ఉందని వినియోగదారులు ఎప్పటికప్పుడు వాపోతున్నా వాటిని నియంత్రించే అధికారులు కరువయ్యారు. ప్రతి వస్తువులో కంపెనీ ఉత్పత్తుల కన్నా నకిలీ ఉత్పత్తులు తక్కువ ధరకు వస్తుండటంతో బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ వస్తువులు విక్రయిస్తున్నారనే ప్రచారాలు ఉన్నాయి. తలకు రాసుకునే ప్యారాచూట్ కొబ్బరినూనె ఆయిల్ బాటిల్స్ కూడా కావలిలో నకిలీలు విక్రయిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధుల తాజా తనిఖీలో వెలుగుచూసింది. వాస్తవానికి ప్యారాచూట్ కొబ్బరినూనె మాతృసంస్థ అయిన మారికో సంస్థ ముంబై హైకోర్టులో వేసిన పిల్ ఆధారంగా ముంబై హైకోర్టు దీనిపై కమిషన్ వేసింది. అందులో సభ్యులైన న్యాయవాదులు ఎం.చెంగప్ప, మల్లేశ్వరరావు పర్యవేక్షణలో మారికో సంస్థ లీగల్ టీం స్థానిక పోలీసుల సహకారంతో శనివారం కావలిలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక దుకాణంలో ప్యారాచూట్ నకిలీ కొబ్బరినూనె బాటిల్స్ పట్టుబడ్డాయి. దీంతో అవి ఎక్కడ తెచ్చారో ఆరాతీసి వారి వివరాలతో సహా ఆ దుకాణం యజమాని నుంచి లిఖిత పూర్వకంగా రాయించుకున్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

పెన్నానదిలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

● కుటుంబ కలహాలే కారణం


పెన్నానదిలో మృతిచెందిన రమేష్‌బాబు

నెల్లూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టేపాళెం వద్ద పెన్నానదిలో ఏఆర్ కానిస్టేబుల్ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానికులు కనుగొని రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గుంజి వేణు కథనం మేరకు వివరాలు.. 2012 బ్యాచ్‌కి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రమేష్‌బాబు (32) స్వగ్రామం ఇందుకూరుపేట మండలం పల్లెపాడు. రేపల్లె సమీప ప్రాంతానికి చెందిన వాణిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి 8 ఏళ్ల పాప ఉంది. ఇరువురి మధ్య కలహాలు ప్రారంభం కావడంతో ప్రస్తుతం వాణి పుట్టింట్లో ఉంది. ఈ క్రమంలో రమేష్‌బాబు పొట్టేపాళెం వద్ద పెన్నానదిలో శవమై తేలడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రమాదవశాత్తు పడి మరణించాడా...? లేక ఆత్మహత్య చేసుకున్నాడా...? అన్నది దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.ఆయన ఈనెల 28వ నుంచి ఎవరికీ అందుబాటులో లేడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపామని, కుటుంబ సభ్యులతో మాట్లాడితేకాని పూర్తి సమాచారం తెలియదని ఆయన పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మే 31 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై నగరంలోని చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. నేపాల్ ప్రాంతానికి చెందిన గగన్, భావన జైషీడ్ దంపతులు. ఉపాధి నిమిత్తం ఆరేళ్ల క్రితం నగరానికి వచ్చారు. నగరంలోని రమేష్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటూ ఓ నర్సింగ్ హోమ్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 24న ఉదయం భావన జైషీడ్ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో గగన్ చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో వివాహిత మృతదేహం


లావణ్య మృతదేహం పరిశీలిస్తున్న పోలీసులు

సంగం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరమనకు చెందిన వివాహిత వన్నె లావణ్య (28) కనిగిరి ప్రధాన కాలువలో మృతిచెంది ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా, లావణ్యకు 8 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన జగదీష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కాగా శుక్రవారం సాయంత్రం నుంచి లావణ్య కనిపించకుండా పోయింది. గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆమె మృతదేహం కాలువలో లభించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య


మృతి చెందిన నవ్య

ఉదయగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శనివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన గాలేటి రమణయ్య, రత్నమ్మల కుమార్తె నవ్య(17) ఫ్రైడ్‌రైస్ కోసం బంధువుల ఇంటి వద్ద ఉన్న తన తల్లిని రూ.50 నగదు అడిగింది. తల్లి తన దగ్గర డబ్బులు లేవని, మందలించి రూ.20 ఇచ్చింది. దీంతో ఆమె మనస్తాపానికి గురై ఇంటికెళ్లి గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొంతసేపు తరువాత ఇంటికొచ్చిన తల్లి ఎంత కొట్టినా తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో గడియ తీసి చూసేసరికి ఉరి వేసుకుని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దింపి చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి మృతురాలి ఇంటిని పరిశీలించడంతో పాటు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కావలిటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలతో పట్టణంలోని జేబీ డిగ్రీ కళాశాలలోని డీఆర్ క్రీడా ప్రాంగణంలో మే1 నుంచి నిర్వహించిన వేసవి క్రీడ శిక్షణ శిబిరాలు శనివారంతో ముగిశాయి. జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో బాస్కెట్ బాల్, వాలీ బాల్, టెన్నిస్ క్రీడాంశాలలో 12 నుంచి 16ఏళ్ల లోపు 90 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్ దాతృత్వంతో బీఎమ్మార్ ట్రస్ట్‌చే అందించిన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. బీఎమ్మార్ దాతృత్వాన్ని పలువురు నాయకులు కొనియాడారు. ముగింపు సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్వోదయ ఈసీ మెంబర్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు, పీడీలు మణికంఠ, హమాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరికో విద్యుత్ సమస్య..!

● పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో ప్రజలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండలంలోని జమ్మలపాలెం ఎస్టీ కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే 11కేవీ లైనుకు సంబంధించిన స్తంభం ఏళ్లతరబడి ఇలానే ఒరిగి ఉంది. ఇది ఎక్కడ తమ ఇంటిపై పడుతుందోనని పక్కనున్న ఇంటి యజమాని దానికి సపోర్టుగా పాత ద్వారబంధం, తలుపు, రెండు సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. రోజురోజుకి అది కూడా శిథిలమవుతోంది తప్ప దానికి మరమ్మతులు చేసి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపడుదామన్న ఆలోచన ఆ శాఖ అధికారులు, సిబ్బందికి లేకపోవడం గమనర్హం. ఈ విషయంపై పలుదఫాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే ట్రాన్స్‌కో సిబ్బంది పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. ఎక్కడో పంట పొలాల్లో అయితే పోనీలే అనుకున్నా నివాసగృహాల మధ్యే ఇలా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. ఇదిలాఉండగా చిన్నపాటి గాలి వీచినా ఇక్కడ స్థానికులు ఎక్కడ స్తంభం పడి ఇళ్లపై విద్యుత్ తీగలు పడి ఏ ప్రమాదం పొంచి వస్తుందోనని గిరిజనులు భయాందోళన చెందుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండలంలోని బ్రాహ్మణక్రాక బస్టాండ్ సెంటర్‌లో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తరచూ మంటలు రావడం, పేలుడుశబ్దాలతో పాటు వైర్లు తెగి కింద పడుతుండడంతో ఆ ప్రాంతంలో నివాసాల వారితో పాటుగా ప్రయాణికులు భీతిల్లుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రజలు తిరుగుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. జనావాసాల మధ్య కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ వేరే ప్రాంతంలో జనసంచారం లేని చోట ఏర్పాటు చేయాలని స్థానికులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవి మచ్చుకు ఓ ఉదాహరణ మాత్రమే. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.. విద్యుత్ సమస్యలతో గ్రామీణ ప్రాంతా ప్రజలు అల్లాడిపోతున్నారు.

జలదంకి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇలాంటి విద్యుత్ సమస్యలు లేని గ్రామం అంటూ ఒక్కటి కూడా లేదు. ప్రతి గ్రామంలో ఏదో ఒక రకమైన విద్యుత్ సమస్యతో పల్లె ప్రజలు నిత్యం అల్లాడుతున్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరంచాలని సిబ్బందిని గ్రామస్థులు అడిగితే వారు పెడచెవిన పెడుతున్నారు. దీంతో ప్రజలు ఏమి చేయాలో తెలియక స్థానిక రాజకీయ పార్టీల నాయకులను ఆశ్రయిస్తున్నారు. అయినప్పటికీ విద్యుత్ సమస్యలు తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆ గ్రామం.. ఈ గ్రామం అని లేకుండా పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికందే అంత కిందక వేలాడుతోన్నాయి. వీటిని సరిచేయాల్సిన బాధ్యత స్థానిక లైన్‌మన్లపై ఉన్నా వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన మండల ట్రాన్స్‌కో ఏఈలు పల్లెల వైపు కన్నెత్తి చూడడం మానేసి కేవలం కార్యాలయాలకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని తెలిసినా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణం.

● **వ్యవసాయానికీ తరచూ అంతరాయం**

ప్రస్తుతం కావలి కాలువకు రెండో పంటకు సాగునీరు విడుదల అయింది. ఈ నీటిని విద్యుత్ మోటార్లతో పొలాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదు. పడమటి గాలులకు సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని రైతులు లైన్‌మెన్‌లను అడిగితే వారిలో స్పందన లేకుండా పోతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వారికి ఇష్టం వచ్చినపుడు వచ్చిపునరుద్ధరిస్తున్నారు. దీంతో వ్యవసాయ పనులు సక్రమంగా సాగడం లేదని రైతులు వాపోతున్నారు. తాజాగా చినక్రాక రైతులకు ఇదే సమస్య తలెత్తడంతో వారి పొలాలకు రోజుల తరబడి సాగునీటి సరఫరా నిలిచి వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి పల్లెల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు తీర్చాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

శివుడు నెలకొన్న శ్మశానం దేవాలయంతో సమానం

● స్వర్గధామంలో దహనశాలల నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భూమిపూజ



దహనశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి) : శివుడు నెలకొన్న శ్మశానం దేవాలయంతో సమానమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. దాత అంకినపల్లి రమేష్‌రెడ్డి దాతృత్వంతో రూ.40 లక్షల వెచ్చించి కావలిపట్టణ ఉత్తరశివార్లలో రోటరీక్లబ్ స్వర్గధామంలో నిర్మించనున్న నాలుగు దహనశాలలకు శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ శ్మశాన వాటికను ఆధునికీకరణకు ముందుకు వచ్చిన దాతను ఆయన అభినందించారు. గతంలోనూ దరిశిసేవా సంస్థ, అభ్యుదయసేవా సంస్థ, ఈవీఎస్, కనమర్లపూడి కోటేశ్వరరావు తదితరులు ముందుకు వచ్చి శ్మశానం అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అలాగే బాలక్రిష్ణారెడ్డినగర్, పాపిరెడ్డి చెరువు పక్కన ఉన్న శ్మశాన వాటికలను కూడా అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు వచ్చి జన్మభూమికి రుణం తీర్చుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని 22వ వార్డు వెంగళరావునగర్‌లోని షాదీమంజిల్ ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

● **ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ**

పట్టణంలోని 18, 29 వార్డులలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఒకటో తేదీకి ముందే పింఛన్లు పంపిణీ చేయటం వృద్ధులు, దివ్యాంగుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్, రోటరీ బాధ్యులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కాకర్లపాలెంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లపాలెంలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి శనివారం రామాలయం ముదు ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. ఆ మహోత్సవాలకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నల్లమోతు లక్ష్మీనరసింహం, హరికృష్ణ, లక్ష్మీ, బ్రహ్మయ్య, రమణయ్య తదితరలుఉ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

అవ్వా, తాతల కళ్లలో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కాకర్లపాలెంలో శనివారం వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాను హర్ష, నల్లబోతు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురం దారి మూత


● పట్టణ వాసులకు ఇక్కట్లు



అన్నపుగుంట తూముల వద్ద పైపులు అడ్డువేయడంతో వెనుదిరుగుతున్న వాహనదారులు

కావలి రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ వైకుంఠపురంలో అన్నపుగుంట పూడిక తీత పనుల్లో భాగం పెద్దపవని రోడ్డు గుండా అన్నపుగుంట మీదుగా పట్టణంలోకి వెళ్లే దారిలో శనివారం పైపులు అడ్డువేసి దారి మూసి వేశారు. దీంతో వైకుంఠపురం, జనతాపేటతో పాటు పెద్దపవని రోడ్డు గుండా పట్టణానికి వచ్చే వాళ్లు దారిలేక పోవటంతో ఉదయగిరి రోడ్డులోని ఫ్లైవర్ బ్రిడ్జి మీదుగా చుట్టు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే టౌన్‌లో పనులు ముగించుకుని గ్రామాలకు వెళ్లే వారు కూడా రాకపోకలకు దారి లేక ఇబ్బందులు పడ్డారు. అధికారులు, పాలకులు స్పందించి వైకుంఠపురంలో ఎన్నో ఏళ్లుగా అసంపూర్తి నిర్మాణంతో ఉన్న ఫ్లైవర్ బ్రిడ్జిని తొలగించి అండర్ బ్రిడ్జి ఏర్పాటు చెయ్యాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల



విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలు

లింగసముద్రం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల వైభంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా శుక్రవారం రాత్రి భక్తులు స్వామి వారిని గ్రామంలో ఊరేగించి, నేతికడవ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు కట్ట దిగువన ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. గ్రామానికి చెందిన దూర ప్రాంతాల్లో ఉంటున్న అనేక మంది గ్రామానికి వచ్చి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ మంగారావు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు ఎస్ఐలు ఎం నారాయణ, వెంకట్రావు, అంకమ్మ, 30 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కందుకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ తక్షణం నివాస స్థలాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఈనెల 2న తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో నిరుపేదలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పీ. మాలకొండయ్య ఒక ప్రకటనలో కోరారు. సొంత ఇల్లులేని పేదలందరికీ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున నివాస స్థలాలు ఇవ్వటంతో పాటు గృహనిర్మాణం కోసం ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు ఆర్థికసహాయం అందించాలని డిమాండ్ చేశారు.

అశ్లీల నృత్యాలు నిర్వహించడం తప్పే

● బహిరంగ క్షమాపణ కోరిన శంభునిపాలెం కాపులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంభునిపాలెం గ్రామ కాపులు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు కార్యక్రమం పొరపాటున జరిగిందని, ఈ పొరపాటుకు తమ గ్రామం తరపున క్షమాపణ కోరుతున్నామని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని శంభునిపాలెం గ్రామపెద్దలు అన్నారు. శనివారం ఆ గ్రామంలో గ్రామ కాపులు, పెద్దలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే సమయంలో హిజ్రాల నృత్యాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో హఠాత్తుగా వర్షం కురవడంతో గ్రామస్తులంతా ఎవరి ఇళ్లల్లోకి వారు వెళ్లిపోవడంతో మద్యం సేవించి ఉన్న హిజ్రాలను స్థానిక ఆకతాయిలు కొంతమంది వివస్త్రాలుగా నృత్యం చేయాలని కోరడంతో వారు వస్త్రాలను తొలగించి 7 నిమిషాల పాటు నృత్యాలు చేశారన్నారు. వర్షం తగ్గిన వెంటనే గ్రామ కాపులు అక్కడకు చేరుకొని వారిని నిలువరించి పారితోషికం ఇచ్చి అక్కడి నుండి పంపించేశామని తెలిపారు. ఇటువంటి సంస్కృతి తమ గ్రామంలో ఎన్నడూ లేదని, ఇది పొరపాటుగా జరిగిందని తెలిపారు. ఇందులో రాజకీయ నాయకుల చొరవ కానీ, పోలీసు అధికారుల సహకారం కానీ ఏమీ లేదని, అనుకోకుండా జరిగిన పొరపాటు మాత్రమేనన్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రసారమై తమ గ్రామం సభ్య సమాజం ముందు తల దించుకోవలసి వచ్చిందని ఆవేదన చెందారు. ఇందుకు బహిరంగ క్షమాపణ కోరుతున్నామని గ్రామ పెద్దలు, కాపులు తెలిపారు. చట్టపరంగా అధికారులు తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు ఆట ఆంజనేయులు, పుచ్చలపల్లి వాసు, నాటారు హజరత్తయ్య, పురిణి శీనయ్య, నాటారు సుధ, పెద్దలు దేవరాజ్, నాటారు వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బీసీ నేత జనిగర్ల రాజీనామా



తన అనుచరులతో కలిసి రాజీనామా ప్రకటిస్తున్న బీసీ నేత జనిగర్ల మహేంద్రయాదవ్

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన బలమైన బీసీ నేత 5వ వార్డు ఇన్‌చార్జి జనిగర్ల మహేంద్ర యాదవ్, మరో ఐదుగురు ముఖ్యనాయకులతో కలిసి పార్టీకి రాజీనామా చేశారు. దీంతో కావలిలో వైసీపీకి మంచి షాక్ తగిలినట్లయింది. ఈ పట్టణంలోని మహేంద్ర లేఅవుట్‌లో శనివారం సాయంత్రం ఆయన తన అనుచరులతో సమావేశమై వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతోపాటు ఆయన అనుచరులుగా ఉన్న 9వ వార్డు ఇన్‌చార్జి తోట శ్రీహరి, 36వ వార్డు ఇన్‌చార్జి సమాధి రవి, 4,5 వార్డుల వైసీపీ ముఖ్య నాయకుడు ఓ శ్రీను, 21వ వార్డు నాయకుడు జలదంకి మాల్యాద్రి, 32వ వార్డు నాయకుడు కొండలరావు తదితరులు పార్టీకి రాజీనామాను ప్రకటించారు. గత కొంత కాలంగా వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జనిగర్ల మహేంద్ర యాదవ్ ఎట్టకేలకు ఆ పార్టీకి రాజీనామా ప్రకటించగా ఆయనకు మద్దతుగా వారి అనుచరులు కూడా రాజీనామ చేశారు. ఈ సందర్భంగా మహేంద్ర యాదవ్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంగ్రెస్, వైసీపీలో కొనసాగిన తాను తన వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మిగతా ఐదుగురు కూడా వ్యక్తిగత కారణాలవలన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన అనుచరులు, అభిమానులు, వార్డు ప్రజల అభిప్రాయాల మేరకు ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

ముమ్మరంగా ఎడగారు వరినాట్లు



వరి నాట్లు వేస్తున్న మహిళలు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : మండల రైతులు ఎడగారు సాగులో నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో 19 వేల ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. మోపూరు మట్టం, అల్లూరు చెరువు, రామన్న చెరువు ఆయకట్టుల పరిధిలోని భూముల్లో అధికారికంగా అనధికారికంగా 40 వేల ఎకరాల్లో రబీ సీజనులో వరిసాగు చేపడుతారు. అయితే అత్యధిక విస్తీర్ణం లోతట్టు ప్రాంతంలో ఉండగా ఆ ప్రాంతంలో వరికోతల సమయంలో వర్షాలు సంభవిస్తే గింజ ధాన్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి కారణంగా స్వాంపు ప్రాంతాల్లోని భూముల్లో రైతులు ఎడగారు వరిసాగు చేపట్టేందుకు ఆసక్తి చూపరు. ఈ క్రమంలో మిగిలిన ప్రాంతమంతా భూముల్లో రైతులు 10 శాతం మంది భూములను చదును చేసి విత్తనాలను నేరుగా పొలాల్లో చల్లగా మరికొంత మంది డ్రమ్‌సీడర్‌ను వినియోగిండం, మిగిలిన 90 శాతం మంది వరినాట్లుకే మొగ్గు చూపుతున్నారు. ఖర్చులను తగ్గించుకునే క్రమంలో విత్తనాల చల్లకం, డ్రమ్‌సీడర్ వినియోగం చేపడుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

అధికారులు మైండ్‌సెట్ మార్చుకోవాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అములులో అధికారులు తమ మైండ్‌సెట్‌ను మార్చుకొని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని వీరనకల్లులో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ కార్డు చేర్పులు, మార్పులకు సంబంధించి నిబంధనలు అడ్డుగా ఉన్నాయంటూ సిబ్బంది తమను సచివాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు పథకాలు అందచేసే విషయంలో అధికారులే చొరవ తీసుకొని ప్రభుత్వ పథకాలు మంజూరయ్యేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, చీమల తాతయ్య, లెక్కల రాంబాబు, యర్రగొండ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకి ఉద్యోగ విరమణ సన్మానం



ఎంఈవో శ్రీధర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

జలదంకి, మే 31(ఆంధ్రజ్యోతి): జలదంకి ఎంఈవోగా సుదీర్ఘ కాలం పనిచేసిన కే.శ్రీధర్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంఈవో దంపతులను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన రాజకీయపార్టీల నాయకులు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరిప్రసాద్, ఎంఈవో-2 నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ పాత విగ్రహంపై కలకలం

కందుకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ పాత మూలవిరాట్‌ను నిమజ్జనం చేయకుండా అలాగే ఉంచటం, అమ్మవారికి అపచారం జరుగుతుందన్న ప్రచారం సోషల్ మీడియాలో జరగటం కలకలం రేపింది. గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణంకు సంకల్పించి గత ప్రభుత్వంలో మూలవిరాట్‌ను తొలగించి నవధాన్యాల రాశిలో ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అయితే పునః ప్రతిష్ఠకు ఆ విగ్రహం అనువుగా లేదని స్థపతి, ఇతర పండితులు నిర్ధారించటంతో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసిన విషయం తెలిసిందే. అయితే నూతన విగ్రహ ప్రతిష్ఠానంతరం పాత విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ జరగలేదు. అయితే ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడిగా, దశాబ్దాలపాటు ఆలయ ధర్మకర్తగా వ్యవహరించిన దివి లింగయ్యనాయుడు పాత విగ్రహాన్ని నిమజ్జనం చేయటం పట్ల అభ్యంతరం తెలపటం వల్ల అప్పట్లో కార్యక్రమం వాయిదా పడిందని కమిటీ సభ్యులు చెబుతున్నారు. అయితే శనివారం అమ్మవారి దీనావస్థ అంటూ చిత్తుకాగితాల మధ్యలో పాత అంకమ్మ మూలవిరాట్ ఉన్నట్లు ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయటంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే అమ్మవారి మూలవిరాట్‌ను ఓ గదిలో ధాన్యరాశిలో ఉంచటంతో పాటు కనిపించకుండా వస్త్రాలు కప్పి ఉన్నాయని ఎవరో కావాలనే అలా చిత్రీకరించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'ఎమ్మెస్సార్'లో జాబ్‌మేళా

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి): కావలిలోని ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాలలో శనివారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ మెగా జాబ్‌మేళాను నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగాలు, ఉపాధిలేక నిర్వీర్యమై రోడ్లమీద తిరిగే పరిస్థితులు వచ్చాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే దృఢసంకల్పంతో యువనాయకుడు నారా లేకేష్‌బాబు కృషి చేస్తూ ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకు వస్తున్నారన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లబ్బుల్ ఖయ్యాం, సీడప్ జేడీఎం హైమావతి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు సుమారు 761 మంది నిరుద్యోగులు హాజరు కాగా వివిధ కంపెనీలకు 289 మందిని ఎంపికచేసి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, ప్రిన్సిపాల్ టీ.ఉమా, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం




అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిమానులు శనివారం మండలం నార్త్ ఆములూరులోని చైల్డ్ అనాథ బాలల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాపనబోయిన జగన్, దానం రజిని, రవ్వా హరి కుమార్, దేసు మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 1 జూన్ 2025

తిరుమల కొండ కిటకిట



కృష్ణతేజ సర్కిల్ నుంచి శిలాతోరణం వరకున్న క్యూలో సర్వదర్శన భక్తులు

- 6లో

పింఛన్ల పంపిణీలో జిల్లాకు రెండో స్థానం

- 2,45,837మందికి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జిల్లాకు రెండవ స్థానం దక్కింది. 2,60,379 మందికిగాను శనివారం రాత్రి 7గంటలకు 2,45,837మందికి పింఛన్ల కింద రూ.105.22 కోట్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి చెప్పారు. జిల్లాలో ఉదయం 6.30గంటలకే సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి లబ్ధికారులకు పింఛన్లు అందించారు. సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. జూన్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందించారు. తిరుపతి నగరంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్‌సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ తదితరులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.



తిరుపతిలో టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్ సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్లు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

మోసం చేసి సంపాదించావు

- డబ్బులు పంపకుంటే కేసు పెడతాం
- సైబర్ ఉచ్చుకు చిక్కి రూ.22.5 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

తిరుపతి(నేరవిభాగం), మే 31(ఆంధ్రజ్యోతి): 'నువ్వు మోసం చేసి డబ్బులు సంపాదిస్తున్నావు. మేము అడిగిన డబ్బు పంపకుంటే కేసు పెడతాం' అంటూ గతంలో బియ్యం వ్యాపారం చేసిన 74 ఏళ్ల వెంకటేష్ గుప్తాను సైబర్ నేరగాళ్లు శనివారం బెదిరించారు. తిరుపతి వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. తిరుపతి నగరం కొత్తవీధిలోని వెంకటేష్ గుప్తా గతంలో బియ్యం వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం వయస్సు మీద పడడంతో ఇంటి వద్దే ఉంటున్నారు. వ్యాపార లావాదేవాలకు సంబంధించి బ్యాంకు అకౌంట్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన మొబైల్ ఫోన్‌కు పోలీసు యూనిఫాంలో ఉన్న వాట్సాప్ పిక్‌తో దుండగులు వాట్సాప్ కాల్ చేశారు. 'మీ ఆధార్ నెంబరు, మీ బ్యాంకు అకౌంటు నెంబర్లు మొత్తం మా వద్ద వున్నాయని మీరు బ్యాంకు లావాదేవీల్లో మోసాలు చేసి డబ్బులు సంపాదిస్తున్నారని బెదిరించారు. దీంతో పోలీసులే ఫోను చేస్తున్నారని ఆయన ఆందోళనకు గురయ్యారు. దీంతో వాళ్లు మరింతగా ఒత్తిడి తెచ్చారు. మీ బ్యాంకు అకౌంటు నుంచి మాకు డబ్బులు పంపకుంటే వెంటనే కేసు నమోదు చేస్తామనడంతో ఆయన భయపడి దాదాపు రూ.22.50 లక్షలు సైబర్ నేరగాళ్ల రెండు అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తీరా వారితో మాట్లాడడానికి ప్రయత్నించగా వారి నెంబరు పనిచేయక పోవడంతో మోసపోయామని గుర్తించి వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అమ్మవారికి బంగారు కాసులమాల


డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు బంగారు కాసుల మాల అందజేస్తున్న దాత కుమార్

పద్మావతి అమ్మవారికి శనివారం బెంగళూరుకు చెందిన కుమార్ 110 గ్రాముల బంగారు కాసుల మాలను కానుకగా అందజేశారు. దీనిని డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్ స్వీకరించారు. దాతకు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూప రింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి


● సంగీత, నృత్య, నాదస్వరం కోర్సుల్లో చేరికకు

దరఖాస్తుల ఆహ్వానం

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం, డోలు పాఠశాలలో 2025-26విద్యా సంవత్సరానికి పలు కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి, నృత్యం, హరికథ, మృదంగం, ఘటం విభాగాల్లో ఫుల్ టైమ్, విశారద(డిప్లొమా), ప్రవీణ(అడ్వాన్సు డిప్లొమా) కోర్సులున్నాయని పేర్కొంది. నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులున్నాయని, ఈనెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించింది. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో ఈవో, టీటీడీ పేరుతో రూ.50డీడీ తీసి దరఖాస్తు పొందాలని, రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణత, సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపింది. మరిన్ని వివరాలకు 9440793205, 9848374408లను సంప్రదించాలని కోరింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్కార్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,721

తలనీలాలు సమర్పించినవారు: 36,011


తిరుపతిలోని రేషన్ దుకాణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర

ఎండీయూ వాహనం వచ్చే రోజుకోసం పని మానుకుని ఎదురు చూడాల్సిన పనిలేదు. పట్టణాల్లో వీధి చివరన.. రోడ్డు పక్కన క్యూలో నిలబడి రేషన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక నుంచి తొలి 15 రోజుల్లో.. మనకు వీలున్నప్పుడు వెళ్లి సరుకులు తీసుకోవచ్చు. జూన్ నుంచీ పాత పద్ధతిలో రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నేటి నుంచి షాపుల్లోనే రేషన్

● దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకే

● పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లాలోని 1457 చౌక ధరల దుకాణాల్లో పాత పద్ధతిలోనే ఆదివారం నుంచి కార్డుదారులకు సరుకులు అందించనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయి నిల్వ కేంద్రాల నుంచి జూన్ నెల కోటాను సంబంధించిన బియ్యం, చక్కెర, కంది పప్పు నిల్వలను రేషన్ దుకాణాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ షాపుల్లో డీలర్లు ఈ-పోస్, తూకం మిషన్లు సిద్ధం చేసుకున్నారు. ధరల పట్టిక, నిల్వ వివరాలు, రేషన్ షాపు నెంబరు ప్రదర్శించాలని ఇప్పటికే డీఎస్‌వో శేషాచలం రాజు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. దుకాణాలు శుభ్రంగా ఉంచుకోవాలని, జూన్ 1న పూలతో అలంకరించాలని ప్రజాప్రతినిధులను, వృద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని అధికారులు పేర్కొన్నారు. ఇక, రేషాపుల్లో ఏర్పాట్లపై అధికారులు తనిఖీ చేస్తున్నారు. తూకం మిషన్లు పనిచేయని చోట తక్షణం కొత్తవి కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలన్నారు. ఇక తాగు నీరు, కూర్చోవడానికి బెంచీలు లేదా కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే ప్రతి రేషన్ షాపులో రెండు ఫ్యాన్ల ఏర్పాటుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వీళ్లకు.. ఇళ్ల వద్దకు

65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి తీసుకెళ్లి సరుకులు ఇవ్వనున్నారు. వీరందరినీ వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాలి. వీరికి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దకు సరుకులు అందించేలా ఏర్పాట్లు చేయాలి.

రేషన్ షాపుల పనివేళలు

ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరుకులు ఇవ్వాలి. ఈ రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచాలి. ఏ చౌక ధర దుకాణం నుంచైనా వారికి అవసరమైన సరుకులు పొందవచ్చును.


అలిపిరి చెక్‌పాయింట్‌లో కార్ల బారులు.. క్యూలో భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య

● కొండపై సమ్మర్ ఎఫెక్ట్

కిటకిటలాడుతున్న తిరుమల

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలువులు చివరిదశలో ఉండటంతో పాటు వారాంతం కావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ఈక్రమంలో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం తరహాలోనే శనివారం కూడా క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు సర్వదర్శన భక్తుల క్యూ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకూ 3 గంటల దర్శన సమయం పడుతోంది. పెరిగిన రద్దీ నేపథ్యంలో శ్రీవారి ఆలయం, మాడవీధులు, అన్నప్రసాదకేంద్రం, వరాహస్వామి విశ్రాంతి గృహాల సర్కిల్, రాంభగీచా, లేపాక్షి కూడళ్లు, బస్టాండ్, యాత్రికుల వసతి సముదాయాలు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, ఎంబీసీ, ఎస్వీ గెస్ట్‌హౌస్ వంటి ప్రాంతాల్లో యాత్రికులు కిక్కిరిసిపోయారు.


జేఈవో ఆఫీసు నుంచి నారాయణగిరి గెస్ట్‌హౌస్ దారిలో.. బారులు తీరుతున్న కార్లు

కొవిడ్ తర్వాత తిరుమలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కంటే సొంతవాహనాల్లో ఎక్కువ మంది భక్తులు వస్తున్నారు. దీంతో తిరుమలలో కార్లు కిక్కిరిసిపోతున్నాయి. శనివారం కూడా అలిపిరి చెక్‌పాయింట్ వాహనాలతో రద్దీగా మారింది. గరుడసర్కిల్ ఆర్చ్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వీవీపీ, సర్వీసు లైన్లతో పాటు ద్విచక్రవాహనాలను అనుమతించే మార్గంలోనూ కార్లను అనుమతించారు. ఇక, తిరుమలలోనూ పార్కింగ్ ప్రాంతాలు నిండిపోవడంతో రోడ్లపైనే భక్తులు వాహనాలను పెట్టి దర్శనానికి వెళ్లిపోతున్నారు. దీంతో తిరుమలలో ట్రాఫిక్ సమస్య నెలకొంది.


అన్నదానం కాంప్లెక్స్ వద్ద భక్తుల రద్దీ

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్‌ల నుంచి

29 పోస్టులు ఔట్

● ఇతర జిల్లాలకు 8 బోధన.. 21 బోధనేతర సిబ్బంది బదిలీ ● బయటి నుంచీ 5 పోస్టుల రాక

● జిల్లాలోనే ఏడు సర్దుబాటు

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు 8 టీచింగ్, 21 నాన్ టీచింగ్ పోస్టులు కోల్పోయాయి. ఈ 29 పోస్టులను ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2008లో పాక్షిక పోస్టులతో మంజూరైన.. 2014-15లో పోస్టులే లేకుండా ఏర్పాటైన పాలిటెక్నిక్‌లలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు సరిపడా లేక నిర్వహణ కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత పాలిటెక్నిక్‌ల నుంచీ కొన్ని పోస్టులను అవసరమైన చోట్లకు ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా టీచింగ్ పోస్టులలో.. తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ నుంచీ తాడిపత్రికి.. పుత్తూరు మండలం పిళ్ళారిపట్టు పాలిటెక్నిక్ నుంచీ నెల్లూరుకు, కడప జిల్లా సింహాద్రిపురానికి ఒక్కోటి చొప్పున.. గూడూరు పాలిటెక్నిక్ నుంచి ఈతముక్కల బాలికల పాలిటెక్నిక్‌కు, నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు ఒక్కోటి వంతున పోస్టులు బదిలీ అయ్యాయి. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ కళ్యాణదుర్గానికి, మదనపల్లె మోడల్ నుంచి కళ్యాణదుర్గానికి, గుంటూరు మైనారిటీ పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున మూడు పోస్టులు బదిలీ అయ్యాయి. ఇక నాన్ టీచింగ్ పోస్టుల విషయానికొస్తే గూడూరు సిరామిక్ టెక్నాలజీ సంస్థ నుంచీ తొమ్మిది, పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ ఎనిమిది, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్ నుంచీ మూడు, గూడూరు పాలిటెక్నిక్ నుంచీ ఒకటి చొప్పున మొత్తం 21 నాన్ టీచింగ్ పోస్టులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యాయి.

● నంద్యాల పాలిటెక్నిక్ నుంచీ తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు ఒకటి, కళ్యాణ దుర్గం నుంచీ పలమనేరు బాలికల పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున రెండు టీచింగ్ పోస్టులు బదిలీ అయ్యాయి. అలాగే శ్రీశైలం, కర్నూలు, నంద్యాల పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున మూడు నాన్ టీచింగ్ పోస్టులు సత్యవేడు పాలిటెక్నిక్‌కు వచ్చాయి.

● తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోనే ఒక పాలిటెక్నిక్ నుంచీ మరో పాలిటెక్నిక్‌కు 8 టీచింగ్ పోస్టులను సర్దుబాటు చేశారు. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ మూడు, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్, కలికిరి, పిళ్ళారిపట్టు, చంద్రగిరి పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున ఏడు టీచింగ్ పోస్టులు తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు బదిలీ చేశారు.

నేడు కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలు

● నిమిషం ఆలస్యమైనా లోపలకు నో ఎంట్రీ

● అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్


తిరుపతిలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం కానిస్టేబుళ్ల ఎంపికకు రాత జరగనుంది. ఈ పరీక్షకు 5207 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే రాత పరీక్షకు నిమిషం ఆలస్యమైన లోపలకి అనుమతి లేదని అదనపు ఎస్పీ, పరీక్షల నోడల్ అధికారి రవిమనోహరాచ్చారి ప్రకటించారు. అభ్యర్థులందరూ గంటన్నర ముందుగా కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ బయోమెట్రిక్ వద్ద వేలి ముద్ర వేసి లోపలికి వెళ్ళి ఆయా కేంద్రాల వద్ద పరీక్షలు రాయాలన్నారు. తిరుపతిలో ఏడు, రేణిగుంటలో ఒకటి, తిరుచానూరులో ఒకటి వంతున కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద సీఐ, ఎస్‌ఐలు, నలుగురు కానిస్టేబుళ్ళు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ళను, ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌ను నియమించారు. డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల లోపు వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్లు, బుక్ షాపులు, ఇతర దుకాణాలు తెరచి వుండకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఒక పెన్, పరీక్ష ప్యాడ్ మాత్రమే తీసుకెళ్లొచ్చన్నారు. తిరుపతిలోని పరీక్షా కేంద్రాలను శనివారం డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు పరిశీలించారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్

పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షల నేపథ్యంలో జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ హర్షవర్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి వచ్చేనెల 30వ తేదీ వరకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నా కార్యక్రమాల నిర్వహించరాదని తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు

గుంతకల్లు వరకు పొడిగింపు

ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబర్18521/18522)ను సోమవారం నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522)గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7.45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది.

ఏక్ నిరంజన్.. శ్యాంప్సన్

● 20 ఏళ్లక్రితం నైజీరియా నుంచి తిరుపతికి

● ఎస్వీయూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి

● అనారోగ్యంతో మృతి చెంది అనాథగా అంత్యక్రియలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

నైజీరియాకు చెందిన ఎస్వీయూ పరిశోధక విద్యార్థి శ్యాంప్సన్ ఓకాన్ (65)నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో శనివారం సాయంత్రం జీవకోనలోని శ్మశానవాటికలో క్రైస్తవ మత ఆచారంతో పోలీసులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎవరీ శ్యాంప్సన్

నైజీరియా దేశాన్ని ఎందుకు విడిచిపెట్టారో తెలియదు. ఇరవై ఏళ్ల క్రితమే ఇండియాకి వచ్చారు. తిరుపతికి చేరుకుని సుమారు తన 45 ఏళ్ల వయస్సులో ఎస్వీఎస్ కాలేజీలో డిగ్రీలో చేరారు. డిగ్రీ పూర్తయిన తర్వాత (2003-06) ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో పీజీలో చేరారు. 2006-08 పీజీ తర్వాత రెండేళ్ల విరామం అనంతరం ప్రొఫెసర్ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో (2010) పీహెచ్‌డీ చేరి 2019లో డాక్టరేట్ పొందారు. డిగ్రీ, పీజీ చదువుకునే సమయంలో వెస్ట్ చర్చి వద్ద ఎస్‌ఏఎల్సీ ఆధ్వర్యంలో ఉండే క్రిస్టియన్ హాస్టల్ (ప్రస్తుత కలెక్టర్ నివాసం పక్కన)లో ఉండేవారు.


శ్యాంప్సన్ మృతదేహం

2017లో ఎల్బీనగర్‌లోని ఓ చర్చిలో రేకుల గదిలో అద్దెకు చేరారు. ఏప్రిల్ 27న సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి యజమాని టీఏ మధుకుమార్ చూస్తే అస్వస్థతతో కనిపించారు. 108కు సమాచారమిచ్చి రుయాస్పత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్సపొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతిచెందారు.

35 రోజులగా మార్చురీలో..

ఇంటి యజమాని మధు కుమార్ ఫిర్యాదు మేరకు యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో శ్యాంప్సన్ వీసా (పాస్‌పోర్ట్ నెంబరు -ఏఓ312988) గడవు ముగిసినట్టు గుర్తించారు. ఆయన మృతిచెందినట్టు న్యూఢిల్లీలోని నైజీరియా హైకమిషన్‌కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ సుముఖత చూపలేదు. నెలరోజులకు పైగా మార్చురీలో ఉన్న మృతదేహం డీకంపోజ్ అవుతోందని, వెంటనే తీసుకెళ్లాలని ఎస్వీ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ వైద్యులు పోలీసులకు సూచించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తిరుపతిలోనే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. విదేశీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మౌర్యకు కలెక్టర్ సూచించారు. శనివారం పోలీసులు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని శ్యాంప్సన్ మృతికి సంబంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన సంజయ్‌గాంధీ కాలనీ స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

5న ఐదు లక్షల మొక్కలు నాటాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన జిల్లావ్యాప్తంగా 5లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అటవీ, డ్వామా, గ్రామ పంచాయతీ శాఖ అధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా ఈ మేరకు మండలాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాట్లు చేపట్టాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాళెం మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోందని, అక్కడ నిమ్మ తోటలు పెంచేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

విపత్తు నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ ఏడాది అధికంగా వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో పంట కాల్వలు, చెరువు కట్టలు, చెక్‌డ్యామ్‌లను బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురుగు, చెత్త తొలగించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు

● అనుమతిచ్చిన ప్రభుత్వం

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలు లేని చోట్ల, రూ.10 లక్షల అంచనా వ్యయం పైబడిన పనులకు షార్ట్ టెండర్లు పిలిచేందుకు అనుమతించాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మైనర్, మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో నిర్వహణ కింద రూ.344.39 కోట్లతో 7174 పనులు చేపట్టేందుకు సంబంధిత అనుమతులు అవసరమని కోరారు. ఇందులో తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 పనులు ప్రతిపాదించారు. షార్ట్ టెండర్ నోటీసులు జారీ చేసి ఈ పనులు చేపట్టేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

జల్సాల కోసం చోరీలు

● నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లు, విలాసజీవితం కోసం అప్పులపాలయ్యాడు. ఆపై సులభ సంపాదనకు దొంగతనం వైపు అడుగేసిన అతడిని తిరుపతి క్రైం పోలీసులు అరెస్టు చేశారు. క్రైం జిల్లా అదనపు ఎస్పీ నాగభూషణరావు తెలిపిన మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం వంకమద్దివారిపల్లికి చెందిన తమటం భానుచంద్రాచ్చారి చిన్నప్పుడే చెడు అలవాట్లకు లోనయ్యాడు. చుట్టు పక్కల వారిని చూసి తానూ విలాస జీవితం గడపాలని అప్పులుచేసి ఇల్లు కట్టాడు. చివరకు అప్పులు తీర్చలేక.. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె, చెర్లోపల్లె, శ్రీకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశాడు. ఇళ్లు, దుకాణాల్లో దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, టీవీలను విక్రయించేవాడు. ఆ డబ్బుతో కొంత అప్పులు తీర్చి మిగతా జల్సాలకు ఖర్చు చేసేవాడు. ఇతనిపై చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోనూ పలు దొంగతనం కేసులు ఉన్నట్లు సమాచారం.


తిరుపతిలో క్రైం పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు

మే 4న శ్రీకృష్ణనగర్‌లోని పుల్లారెడ్డి కుటుంబం బెంగళూరుకు వెళ్లింది. మళ్ళీ మే 16న ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉంది. ఇంట్లోని దాదాపు 21 గ్రాముల బంగారు నగలు, 488 గ్రాముల వెండి వస్తువులు, రెండు టీవీలు, ఇతర వస్తువులు లేవు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్‌కు బాధితుడు పిర్యాదు చేశారు. పాత నేరస్తులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించారు. వేలి ముద్రలు, ఫొటో ఆధారంగా నిందితుడు చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన వాడని గుర్తించారు. అతడి సెల్‌ఫోన్ నెట్‌వర్కు ఆధారంగా శనివారం రాయలచెరువు రోడ్డులో తచ్చాడుతుండగా క్రైం డీఎస్పీ నేతృత్వంలోని సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, క్రైం పార్టీ పోలీసులు నిఘా ఉంచి అరెస్టు చేశారు. ఎస్వీయూ పరిధిలో జరిగిన రెండు చోరీలు, క్రైం పరిధిలో జరిగిన ఒక చోరీ కేసుకు సంబంధించి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రెండు టీవీలు, గ్యాస్ సిలిండర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐలతో పాటు ఎస్‌ఐ, ఏఎస్‌ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుళ్ళు రవిప్రకాష్, మురళి, మునిరాజ, రమేష్, కానిస్టేబుళ్ళు నాగరాజు, మోహన్, ఈశ్వర్, హరిప్రసాద్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

భూ ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్‌ఐ నాగరాజుకు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): తనకు వారసత్వంగా వచ్చిన భూమిని మునివర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి వరినాట్లు వేశాడని మండలంలోని ఆర్లపాడు గ్రామానికి చెందిన సన్నాడి సుబ్రహ్మణ్యంరెడ్డి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఎస్‌ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశాడు. సర్వే నెంబరు 319-13లోని 13 సెంట్లు మాగాణి భూమి తన తండ్రి జయరామిరెడ్డి నుంచి వారసత్వంగా వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 1బీ, అడంగళ్‌లో కూడా తన పేరు మీదనే ఉన్నాయని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్‌ఐ నాగరాజు మాట్లాడుతూ భూ వివాదం డీఆర్వో కోర్టులో ఉన్నందున రెవెన్యూ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా, భూ ఆక్రమణలపై రెవెన్యూ, పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి కోరారు. కొంతమంది అధికారుల తీరుతో ఆర్లపాడు గ్రామంలో భూముల రికార్డులు తారుమారయ్యాయని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రమేష్ నాయుడు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, కలవకోలు మునీష్, దువ్వూరు రాకేష్‌రెడ్డి, కేవీ నాయుడు, నర్రావుల లోకేష్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనుల అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కొండప నాయుడు

తడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మాంబట్టు సెజ్‌లో సబ్‌స్టేషన్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. మాంబట్టులో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి చేతులమీదుగా శంకుస్థాపన జరిగింది. ఆ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సెజ్‌లో భూములను రెవెన్యూ అధికారులు కేటాయించారు. శనివారం ట్రాన్స్‌కో డీఈ బలరామ్‌మూర్తి ఆధ్వర్యంలోని అధికారుల బృందం పనులను శనివారం ప్రారంభించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. సదరు స్థలాన్ని నివాస గృహాల కోసం కేటాయించారని, మరొక చోట సబ్‌స్టేషన్ నిర్మించాలని చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ కొండపనాయుడు ఘటనాస్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులు సర్వేచేసి సమస్య పరిష్కరించే వరకు పనులను అడ్డుకోవద్దని సూచించారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిసి కట్టుగా అవగాహనతో పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు. శనివారం కళాశాలలో వరల్డ్ నో టొబాకో డే నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు పొగాకు వాడటం వల్ల కలిగే నష్టాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ కళాశాల నుంచి విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు వినియోగం సరదాగా మొదలుపెట్టి అలవాటుగా మారి, అటు తర్వాత వ్యసనంగా మారుతుందన్నారు. ఫలితంగా ఆరోగ్యం దెబ్బతింటుదన్నారు. యువత ధూమపాన అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి, డాక్టర్ మాధవయ్య, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దక్కిలి, మే 31(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని సంగనపల్లిలో సివిల్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎంఈవో జగదీష్ బాబు మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని కోరారు. గ్రామంలో డ్రాపౌట్స్ లేకుండా చూడాల్సి బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివశంకర్, ఈవోపీఆర్డీ అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం

సూళ్లూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని సాయినగర్‌లో ఉంటున్న ప్రతిభ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్యం కోసం సేకరించిన రూ.33 వేలను పూర్వ విద్యార్థులందరూ శనివారం ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మణివాస్, సూళ్లూరుపేట సేవా సమాఖ్య సభ్యులు ఉస్మాన్ భాషా, మల్లికార్జున, జగన్నాథ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

వాకాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించకూడదని తహసీల్దారు రామయ్య అన్నారు. మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ, అంజలపురం మత్స్యకార గ్రామాల్లో శనివారం పౌరహక్కుల దినం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ పౌరహక్కులకు భంగం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందరూ సోదర భావంతో మెలగాలని, కులవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రామయ్య

10న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నాయుడుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన శర్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శనివారం ఆవిష్కరించారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17 బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సి పాల్ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి, యువకులు జాబ్‌మేళాలో పాల్గొన వచ్చన్నారు. 99850 56929, 9988853335 నెంబర్లకు కాల్‌చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో యోగా శిక్షణ

సూళ్లూరుపేట, మే 31(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ వెంకటశర్మ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని సులభంగా జయించే శక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





వావిళ్ల దొరువు వద్ద ఆరబెట్టిన వేరుశనగ - ధర రాకున్నా తప్పనిసరి పరిస్థితుల్లో అమ్మకాలు

వేరుశనగ... దళారుల దగా

- గుజరాత్ సీడ్‌కు డిమాండ్ లేదంటూ ప్రచారం
- తీరప్రాంత రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు
- నష్టాలపాలవుతున్నామంటూ అన్నదాతల ఆవేదన

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): సముద్రతీర గ్రామాల్లోని వేరుశనగ రైతులు దళారుల చేతుల్లో దగాపడుతున్నారు. సిలికా భూముల్లో మూడు నెలల పాటు సాగు చేసిన గుజరాత్ రకం పంటకు గిట్టుబాటు ధర లభించక నష్టాల బాటపడుతున్నారు. రెండు నెలల వరకు డిమాండ్‌తో ఉన్న ఈ రకం కాయలకు హఠాత్తుగా మార్కెట్‌లో డిమాండ్ పడిపోయిందంటూ బ్రోకర్లు చేస్తున్న ప్రచారంతో రైతులు దిగులు చెందుతున్నారు. కోట, చిల్లకూరు సరిహద్దు మండలాల్లోని సిలికా భూముల్లో రైతులు కొన్నాళ్లుగా వేరుశనగ సాగు చేస్తున్నారు. బిందుసేద్యం ద్వారా లాభాలు గడిస్తూ వచ్చారు. ఈ ఏడాది అదను పోకమునుపే 3500 ఎకరాల్లో గుజరాత్ సీడ్ సాగు చేపట్టారు. అయితే ఈసారి అనుకున్న దిగుబడి రాలేదు. దీనికితోడు గిట్టుబాటు ధర కూడా లభించడంలేదు. ఇదే అదునుగా దళారులు రంగంలోని దిగారు. గుజరాత్ సీడ్ రకానికి డిమాండ్ పడిపోయిందంటూ ప్రచారం మొదలెట్టారు. రైతులు బయట ప్రాంతమార్కెట్లకు వెళ్లి సొమ్ము చేసుకోలేక బ్రోకర్లు అడిగిన ధరకే పంటను అమ్ముకుంటూ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం 460 కిలోల(పుట్టి) గుజరాత్ సీడ్ వేరుశనగ కాయలకు రూ.34 వేల నుంచి రూ.35వేల వరకు పలికింది. ప్రస్తుతం డిమాండ్ లేదనే సాకుతో దళారులు రూ.30వేలకు కొంటున్నారు. పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





గూడూరులో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ పింఛన్ల పంపిణీ

హామీలన్నీ అమలు చేస్తాం: పాశం

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని, ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వరపురంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి హామీని సీఎం నేరవేరుస్తున్నారన్నారు. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాన సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు పరచనుందన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా వర్షాల సమయంలో నివాస గృహాల్లోకి వరద నీరు చేరుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరదనీరు చేరకుండా ఉండేందుకు రివిట్‌మెంట్ వాల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, బత్తిన ప్రణీత్, ఓంప్రకాష్, రవీంద్రరెడ్డి, వాటంబేడు హరి, పేటేటి చంద్రనీల్, చంద్ర మౌళి, నటశేఖర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బీడీ కాలనీలో లబ్ధిదారులకు శనివారం ఉదయం ఎమ్మెల్యే విజయశ్రీ పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు నానా బాల సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, పొట్లపూడి రాజేష్, షరీఫ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని 10వ వార్డు మనులాలపేటలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాధ నాయుడు, గంగాధరం, బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, కాపా శ్రీనివాసులు నాయుడు, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని ఓడూరు గ్రామంలో లబ్ధిదారులకు టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి పింఛన్లు అందజేశారు. గుండాల శ్రీనివాసులు, చిట్టేటి కీరవాణి పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు, పెళ్లకూరు, తాళ్వాయిపాడు, చిల్లకూరు గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య పింఛన్లు పంపిణీ చేశారు. స్వర్ణముఖినది ఆనకట్ట కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, రాధానాయుడు, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, నర్రావుల మోహన్‌నాయుడు, వేణురెడ్డి, గోపి, చలపతి పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగం అనారోగ్యకరం





గూడూరు, సూళ్లూరుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా గడపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోహనా, డాక్టర్ ప్రసన్న, సిబ్బంది లలిత తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం నిర్వహించారు. కళాశాల నుంచి షార్ బస్టాండు వరకు ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ మాట్లాడుతూ ధూమపానం నిర్మూలనపై విద్యార్థులు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కోటీశ్వరరావుకు సన్మానం



కోటీశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగస్తులు

వెంకటగిరి టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎంపీడీవో కోటీశ్వరరావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. కోటీశ్వరరావు, లక్ష్మీ ప్రభావతి దంపతులను గజ మాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

భూ సారాన్ని అనుసరించి పంటలను సాగు చేయాలి

వెంకటగిరి టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): భూ సారాన్ని అనుసరించి పంటలను సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక యాతలూరు, మన్నేగుంట, బంగారుపేటలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఖరీఫ్ పంటలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంట వైవిధీకరణ వంటి అంశాల గురించి విశదీకరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో శనివారం డాక్టర్ రమణయ్య దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాధయ్య, మురళీ నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణలో ఊరేగించారు.

వేధింపులపై ఫిర్యాదు

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఓ చిట్‌ఫండ్ కమిటీ అధికారుల వేధింపులు తాళలేకే తన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని మండల పరిధిలోని కేశవరం పంచాయతీ రాఘవపురం గ్రామానికి చెందిన గడ్డం పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త మహేష్ ఓ ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తారని, ఇన్సూరెన్స్ నగదును రూ.6 లక్షలకు పైగా చెల్లించడం జరిగిందన్నారు. అయితే పైసా కూడా చెల్లించలేదని ఆ కంపెనీ అధికారులు చెప్పడంతో తన భర్త మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఆదివారం సూళ్లూరుపేట సేవా సమాఖ్య, ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఉస్మాన్ భాషా తెలిపారు.

ఏపీవో దయానందంకు సత్కారం

పెళ్లకూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీవో దయానందం శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో దయానందం దంపతులను అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీడీవో ప్రమీలారాణి, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు నంచి కృష్ణయ్య, కలిచేటి నరసింహులు, నాయకులు సిద్దులయ్య, మురళీ నాయుడు, హరినాయుడు, కేవీనాయుడు, యుగందర్, పోలయ్య, సుబ్రహ్మణ్యం, గోగుతోటి మురళి, కలపాటి సురేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



దయానందం దంపతులను సత్కరిస్తున్న అధికారులు

రాయితీపై రైతులకు డ్రోన్ల పంపిణీ

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై రెండు డ్రోన్‌లను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 80శాతం రాయితీతో రైతులకు డ్రోన్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌గా భానుప్రకాష్‌రెడ్డి



గూడూరు అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌గా శ్రీకాళహస్తి ఆర్డీవోగా భానుప్రకాష్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రమీనా జూన్ 20వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో శ్రీకాళహస్తి ఆర్డీవోగా భానుప్రకాష్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భానుప్రకాష్‌రెడ్డికి రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తిన్నెలపూడిలో సివిల్ రైట్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జయజయరావు

కోట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ నారుమిట్ట గిరిజన కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే జరిగింది. తహసీల్దార్ జయజయరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పౌర హక్కుల అవశ్యకత గురించి వివరించారు. రాజ్యాంగం ద్వారా గిరిజనులకు సంక్రమించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య, ఈవోపీఆర్డీ కిరణ్‌కుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత

సూళ్లూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షార్ బస్టాండు, షార్ సర్కిల్ పరిధిలోని మురుగు కాలువల్లో శనివారం పూడిక తీత పనులు ప్రారంభించారు. కాలువల్లో మురుగునీరు సజావుగా పారేందుకు వీలుగా చెత్త, చెదారం, వ్యర్థాలను తొలగించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మురుగు నిల్వకుండా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయడంతో పాటు పారిశుద్ధ్యం దృష్టి పెట్టినట్లు కమిషనర్ చిన్నయ్య తెలిపారు.

